నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
1
శుక్రవారం | డిసెంబర్ 22, 2023 | www.navatelangana.com

స్పోర్ట్స్ మీట్‌లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-శాయంపేట



ఉమ్మడి వరంగల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ స్పోర్ట్స్ మీట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ లలో శాయంపేట మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఏ. రాహుల్ జావలింగ్ త్రోలో మొదటి బహుమతి, హై జంప్ లో రెండవ బహుమతి, లాంగ్ జంప్ లో రెండో బహుమతి, జి. అఖిల్ 60 మీటర్ల పరుగు పందెంలో మూడో బహుమతి, 600 మీటర్ల పరుగు పందెంలో మూడవ బహుమతి, షాట్‌పుట్‌లో మూడో బహుమతి , లాంగ్ జంప్‌లో మూడో బహుమతి , జి.సిద్ధు హై జంప్లో మొదటి బహుమతి, ఎండి.రఫీక్, ట్రైయతలిన్ లో మూడవ బహుమతి, కే.సాయి విగ్నేష్ ట్రైయతలిన్ లో మొదటి బహుమతి, ఆర్.రిశ్విక్ 100 మీటర్ల పరుగు పందెంలో రెండవ బహుమతి , 600 మీటర్ల పరుగు పందెంలో రెండవ బహుమతి, ఎం.అనిల్ లాంగ్ జంప్‌లో మొదటి బహుమతి సాధించారు. వీరిని గురువారం ప్రిన్సిపల్ మోతే రాజ్ కుమార్, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వేలేరు



మండల కేంద్రం వేలేరులోని మండల విద్యా వనరుల కేంద్రంలో 0 నుండి 19 ఏళ్లలోపు అంగవైకల్యం గల పిల్లలకు ఫిజియోథెరఫీ క్యాంపు జెడ్పిహెచెస్ వేలేరు హెచ్ ఎం జి రాజన్న గురువారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ మండల విద్యావనరుల కేంద్రం వేలేరులో వారంలో ప్రతి గురువారం ఈ క్యాంప్ కొనసాగుతుందని తెలిపారు. మండలంలోని 19 ఏళ్లలోపు అంగవైకల్య పిల్లలను తల్లిదండ్రులు తీసుకొచ్చి ఫీజియోథెరపీ చేయిస్తే వారి అంగవైకల్యం తొలుగుతుందని. సాధారణ పిల్లలుగా తయారయ్యే అవకాశం ఉంది కావున మండలంలోని ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లీలాబాయి, ఫిజియోథెరపిస్ట్ ఆర్.మమత, ఐఈఆర్పిలు స్నేహలత, తిరుపతి, సిఆర్పి మొగిలిచర్ల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్



నవతెలంగాణ-హన్మకొండ

యువత అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తెలిపారు. హనుమకొండ జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా యువజన ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా యువజన సంక్షేమ, క్రీడలశాఖ అధికారి గుగులోత్ అశోక్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి.అజీజ్‌ఖాన్ హాజరై మాట్లాడుతూ భారతదేశం అత్యధిక యువ జనాభా కలిగిన దేశంఅని అన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో యువత పాత్ర అమోఘమైందని తెలంగాణ రాష్ట్రసాధనలో యువతి యువకులు చేసిన పోరాట ఫలితమే ఈరోజు మనం స్వరాష్ట్రంలో జీవనాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ముఖ్యంగా మనతెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని వైభవాన్ని ప్రతిఒక్కరు తప్పకుండా ఆచరిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువతలో ఉన్న శక్తిని వెలికి తీయడానికి ఇలాంటి యువజన ఉత్సవాలు చాలా ఉపయోగపడతాయి అన్నారు. మరొక ప్రత్యేక అతిథిగా హాజరైన జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఒక నూతన యువజనపాల్సీని మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ, పట్టణ యువతీ యువకులను సాంస్కృతిక రంగాల్లో అలాగే క్రీడరంగాల్లో రాణించడానికి ప్రత్యేకమైనటువంటి పాలసీని తీసుకువచ్చి వారిని అభివృద్ధి పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన అవార్డు గ్రహీత గంగోజుల నరేష్ ,యువజన సంక్షేమ శాఖ సిబ్బంది నయుం, సుజన్, ఏవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కోడిమాల శ్రీనివాస్ రావు, సిబ్బంది వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువతీ యువకులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహు మతులు ప్రదానం చేశారు.

అవగాహన లేని చైర్మన్‌ను తొలగించాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంపై అవగాహన లేని సంఘం చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డిని పదవి నుంచి వెంటనే తొలగించాలని సిపిఐ మండల కార్యదర్శి పత్తి ఆనంత్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు ముద్దసాని సత్యనారాయణ రెడ్డి సంఘంపై కనీస అవగాహన లేకపోవడంతో సంఘం రోజురోజుకీ నష్టాల్లోకి వెళుతుందని ఆరోపించారు. రెండుసార్లు మహాసభలో రైతులు సంఘం అభివృద్ధి కోసం కమిటీ వేయాలని, గత పాలకవర్గం చేసిన అవినీతిపై విచారణచేపట్టాలని, సంఘం వ్యవస్థాపకులు కంది వీరారెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేసినప్పటికీ వాటిని ఏమి పట్టించుకోకుండ చైర్మన్ వస్తున్నారే పోతున్నారే తప్ప సంఘం అభివృద్ధి ఆలోచించడం లేదని ఆయన విమర్శించారు.

అలాగే సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ఫంక్షన్ హాల్ ను టెండర్ల ద్వారా పనులు చేపట్టాలని, ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. సుమారు రూ.20 కోట్ల రుణమాఫీ వచ్చిందని వాటి ద్వారా ప్రతి సభ్యులకు బోనస్ గా అందించాలని కోరారు. అధ్యక్షులు పనితీరు మారకపోతే తగిన గుణపాఠం తప్పదని వారన్నారు.


డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-మట్టెవాడ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి కార్యాలయంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు కేక్‌కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రతి ఒక్కరూ స్నేహ భావంతో మెలగలని, ప్రశాంతత, సేవ గుణం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖఅధికారి డాక్టర్ మదన్ మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ హిమబిందు, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, ఏఓ చంద్ర కళ, డిపిఎచ్ఎన్ఓ సుశీల, సూపరింటెండెంట్ వేణు, డిప్యూటీడెమో ప్రసాద్, సిహెచ్ఓ నె ప్రూచందు, భాగ్యలక్ష్మి నీరజ, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్లో, సూర్యపేటతండా గ్రామంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. అనంతరం క్రైస్తవ ఉపాధ్యాయులు కేక్ కట్ చేశరు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు అందించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అండేం కరుణాకర్‌రెడ్డి, ఆర్.బాలరాజు, అరులయ్య, విష్ణు,కందిక నవీన్, పతకమూరి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నవతెలంగాణ-వేలేరు



మండల కేంద్రం వేలేరుకు చెందిన బైరి చిన్న వెంకటయ్య (55) తండ్రి నారాయణ అనే గీత కార్మికుడు గురువారం తన వృత్తిలో భాగంగా కల్లు గీయడానికి తాటిచెట్టు పైకి ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడటం వల్ల గాయాల పాలైన సంఘటన జరిగింది. ఇది గమనించిన స్థానికులు వెంకటయ్య ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ నజర్

- ఇంచార్జీల నియామకం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంటు ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో త్వరలో జరుగబోయే పార్లమెంటు ఎన్నికలపై కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జిలను నియమించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గానికి మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. శాసనసభ సమావేశాలు ముగిశాక ఈ మేరకు ఆయా పార్లమెంటు నియోజకవర్గాలవారీగా పార్టీ శ్రేణులను సమాయత్తంచేసి రెండు పార్లమెంటు నియోజ కవర్గాల్లో విజయం సాధించే దిశగా ప్ర యత్నాలను ముమ్మరం చేయనుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో విజయం సాధించడానికి అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతుంది. జిల్లాలోని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం లోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం మినహా మిగతా 6 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కేవలం భద్రాచలం మినహా మిగతా 6 శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయం విధితమే. ఈ క్రమంలో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా పాతాలని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి వేగంగా పార్టీ నాయకత్వం పావులు కదుపుతుంది. ప్రస్తుతం వరంగల్, మహబూబాబాద్ రెండు పార్లమెంటు నియోజకవర్గాలకు బిఆర్ఎస్ ఎంపీలే వున్నారు.

వరంగల్‌కు 'కొండా'

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్రస్తుతం వరంగల్ పార్లమెంటు నియోజకవర్గానికి బిఆర్ఎస్ ఎంపి పసునూరి దయాకర్ ఎంపిగా వ్యవహరిస్తున్నారు. ఈ నియోజకవర్గం లో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఈ పార్లమెంటు నియోజకవర్గంలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్‌అభ్యర్థి కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలిచారు. జనగామ నియోజకవర్గం భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో వుంది.

తాజా ఎన్నికల నేపథ్యంలో వరం గల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 6 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే వుండడంతో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని పార్టీ వర్గాలు ధీమాతో వున్నాయి. దీంతో వెనువెంటనే పార్లమెంటు ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి కసరత్తును వేగవంతం చేశారు.

మహబూబాబాద్‌కు 'పొంగులేటి'

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ నియోజకవర్గంలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు నియోజకవర్గాలతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, పినపాక, ఇల్లందు నియోజకవర్గాలున్నాయి. ఇందులో తాజా శాసనసభ ఎన్నికల్లో భద్రాచలంలో మాత్రమే బిఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మిగిలిన 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించడం గమనార్హం. దీంతో ఈ పార్లమెంటు సీటును గెలుచుకుంటామని పార్టీ శ్రేణులు ధీమాతో వున్నాయి.

'పొంగులేటి'కి పట్టు

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గట్టి పట్టుంది. అంతేకాకుండా ఈ పార్లమెంటు నియోజకవర్గంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 3 అసెంబ్లీ నియోజకవర్గాలు కూడా వుండడంతో 'పొంగులేటి'కి బాధ్యతలు అప్పగించారు. 'పొంగులేటి'కి ఖమ్మం పార్లమెంటుతోపాటు మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాలను అప్పగించడం గమనార్హం. 'పొంగులేటి'కి డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి దగ్గరి బంధువు కావడం కూడా ఈ పార్లమెంటు సీటును ఆయనకు అప్పగించడానికి కారణంగా పరిశీలకులు భావిస్తున్నారు. ఏదేమైనా పార్లమెంటు ఎన్నికల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ లక్ష్యంగా పావులు కదుపుతుండడంతో బిజెపి సైతం ఆ దిశగా అడుగులు వేస్తుంది.

ప్రీ క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

- బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్

నవతెలంగాణ-వరంగల్



ముందస్తు క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ప్రభుత్వ పరంగా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. వరంగల్ (తూర్పు)నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తు క్రిస్మస్ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై బల్దియాప్రధానకార్యాలయంలో చర్చి ఫాస్టర్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కమీషనర్, వేడుకల నిర్వహణ బాధ్యులు పాల్గొని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రీ క్రిస్మస్ వేడుకల నోడల్ అధికారి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 23న ప్రీక్రిస్మస్ వేడుకలు (ఫీస్ట్) నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం క్రిస్మస్ సెలబ్రేషన్ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగానిర్వహించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని ప్రభుత్వ పరంగా పేద క్రిస్టియన్‌లకు బహుమ తులను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించిందని, సీసీటీసీ వారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి, ప్రభుత్వం సూచించిన ఆదేశాల ప్రకారం వేడుకలు ఘనంగా నిర్వహించడానికి కావాల్సిన ఏర్పాటు చేయడంతో పాటు వేడుకల్లో పాల్గొన్న వారికి భోజన వసతి కూడా కల్పించడం జరుగుతుందన్నారు. వరంగల్ తహశీల్దార్ మాట్లాడుతూ సుమారు 1000 మంది లబ్దిదారులకు బహుమతుల పంపిణీ చేయాలని భావించినప్పటికీ మంత్రి కొండాసురేఖ ఆదేశం మేరకు అదనంగా మరో 2 వేలమందికి బహుమతులు అందజేస్తామని ప్రకటించడం జరిగిందని, వేడుకల నిర్వహణకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చర్చిల ఫాస్టర్లు, ప్రజలు సహకరించాలని మంత్రి కోరడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్, ఖిలా వరంగల్ తహశీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు, సూపరింటెండెంట్ హబీబ్‌తో పాటు నాయకులు నవీన్‌రాజ్, ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి నుండి చెత్త సేకరణ జరగాలి

- నగర మేయర్ గుండు సుధారాణి



నవతెలంగాణ-వరంగల్

బల్దియా వ్యాప్తంగా ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ విధిగా జరగాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో శానిటేషన్, మలేరియా విభాగాల అధికారుల తో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వ హించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆటో లు ప్రతినిత్యం ప్రతిఇంటి నుండి చెత్త సేకరణ జరిగేలా చూడాలని, రోడ్డు మీద ఎక్కడ చెత్త పడకుండా చూస్తూ స్వచ్ ఆటోల లాగ్‌బుక్ విధిగా నిర్వహిం చేలా చూడాలన్నారు. మురుగు కాలువలను డిసిల్ట్ ఎప్పటికపుడు నిర్వహించాలన్నారు. దోమలు, లార్వాలను నియంత్రించడానికి ప్రణాళిక బద్ధంగా ఆయిల్‌బాల్స్ వేయాలని ఈ సందర్భం గా మేయర్ సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్, బయలజిస్ట్ మాధవ రెడ్డి,శానిటరీ సూపర్‌వైజర్‌లు సాంబయ్య, భాస్కర్, నరేందర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి : తహశీల్దార్



నవతెలంగాణ-సంగెం

తప్పులు లేని ఓటర్ లిస్ట్ ను రూపొందించడానికి బీఎల్‌ఓలు అందరు కషి చేయాలని సంగెం తహశీల్దార్ జి.రాజ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించడం జరిగినది. ఓటర్ లిస్టులో తప్పుగా ముద్రణ కాబడిన వాటిని బిఎల్‌ఓ లందరూ గుర్తించి సరి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు.మండలంలోని బిఎల్‌ఓ లందరూ ఓటర్ లిస్ట్ ప్రక్షాళన లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉంటున్న 18 ఏళ్లు పైబడిన వారందరికీ స్థానిక ఆధారాలతో ఓటు హక్కును కల్పించాలని సూచించా రు. డబుల్ ఓటర్స్ ను, మరణించిన ఓటర్స్ ను తప్పుగా ముద్రణ కాబడిన ఫోటోలను తప్పకుండా గుర్తించి సరిచేయాలని అన్నారు. రానున్న ఎన్నికలలో ఓటర్ లిస్టులో ఎలాంటి తప్పులు దొర్లకుండ బిఎల్వోలు జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.



ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపిఎస్ఓ సతీష్,శిక్షణ ఇవ్వగా నాయబ్ తహశీల్దార్ శ్రీనివాస్, గిర్దవార్‌లు బాలాజీ, శారద, జూనియర్ అసిస్టెంట్ రవి, కార్యాలయ సిబ్బంది, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు తహశీల్దార్ సన్మానం

నడికుడ : జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు మండలంలోని 31 మంది బీఎల్‌ఓలందరికీ సంక్షిప్త సవరణ 2024జనవరి 1 అర్హత తేదీని దృష్టిలో పెట్టుకొని ట్రైనింగ్ ఇవ్వడం జరిగినది. అలాగే వారి స్థాయిలో అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించిన అందరూ బీఎల్‌ఓల అందర్నీ శాలువలతో సత్కరించి వారి సేవలను తహశీల్దార్ నాగరాజు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిటీ ఆర్.సత్యనారాయణ, ఎంఆర్ఐ హేమానాయక్, సీనియర్ సహాయకులు శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ మహేష్, రాజు, రాణి, ప్రభాకర్, అలాగే బిఎల్వోలు పాల్గొన్నారు.

హెల్త్ డైరెక్టర్‌లను కలిసిన టిజిపిఏ




నవతెలంగాణ-మట్టెవాడ

రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ త్రివేని, కమిషనర్ ఆఫ్ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్‌వీ.కర్ణన్, ఐఏలను టిజిపిఏ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాదులో మర్యాద పూర్వకముగా కలిసి పుష్పగుచ్ఛాలు, షాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ ఫార్మసిస్టు లకు పదోన్నతులు కల్పించడంతోపాటు ఫార్మసీ ఆఫీసర్ గా పేరు మార్చి పని భారం తగ్గించాలన్నారు. మిగితా అన్నీ సమస్యలన్నింటినీ పరిష్కరిం చాలని నూతనంగా పదవీబాధ్యతలు తీసుకున్న అధికారులను కోరారు. అధికారులు వెంటనే స్పందిస్తూ తప్పకుండ పరిష్కరిస్థా మని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కంద కట్ల శరత్ బాబు, స్టేట్ గౌరవ అధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి,స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్, స్టేట్‌కోశాధికారి యాదయ్య,అడ్వాజర్లు ముతార్,అహ్మద్‌ఉల్లా ఖాన్, ఉపాధ్యక్షులు పంద్రాల శంకర్, ఎల్.రామ్ చందర్, కార్యదర్శులు ప్రియదర్శిని, రాష్ట్ర కమిటీసభ్యులు, జిల్లాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు చేయూతనందిస్తాం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



మల్లికాంబ మనోవికాస కేంద్రానికి ఎల్లప్పుడు అండగా ఉంటానని కార్‌బాక్స్ డెటాలింగ్ స్టూడియో సీఈవో సంగీత్ శ్రీపతి అన్నారు. గురువారం హనుమకొండ బాల సముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంను సంగీత్ శ్రీపతి తన టీంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు సేవచేయడం దైవ కార్యంగా భావించి వారిని కంటికి రెప్పలా చూసుకుంటున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం పిల్లలకు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న తనవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్‌బాక్స్ కంపెనీ సభ్యులు లావణ్య, లోకేష్, వినోద్, శర్మ మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు రామలీల, సిబ్బంది కోడం కళ్యాణ్, రాధిక రెడ్డి, పద్మ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో 'ఏకశిల'కు ప్రథమ స్థానం

- విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-వర్ధన్నపేట



తెలంగాణ స్టేట్ లెవెల్ సైన్స్ ఫెయిర్ లో ఏకశిలా విద్యార్థులు ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అడ్మిన్ ఇంచార్జి ఎండి బాబా, వైస్ ప్రిన్సిపాల్ రవికిరణ్‌లతో కలిసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో అటల్ టింకరింగ్ సైన్స్ ఎగ్జిబిట్స్‌ఫెస్ట్ 2023-24 పురస్కరించుకొని వరంగల్ లో నిర్వహించిన పోటీల్లో ఖమ్మం హైవేలోని ఏకశిల సిబిఎస్ఇ అండ్ స్టేట్‌స్కూల్స్ విద్యార్థులు సీనియర్ విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకున్నారని అగ్రస్థానంలో నిలవ డం గౌరవంగా ఉందని తిరుపతి రెడ్డి తెలిపారు. వాతావరణంలో గాలి ఎలా ఆవరించి ఉందో మనిషి నిజజీవితంలో సైన్సు కూడా అలా ఉంటుందన్నారు. ఇది టెక్నాలజి యుగం అని, ఈ సమయంలో టెక్నాలజీ తెలియకుండా జీవించలేమని అన్నారు. పూర్వ కాలంలో ఎందరో సైంటిస్టులు అనేక పరికరాలు కనుక్కొని జీవితాన్ని సులభతరం చేసారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని రాబోయే నవ శకానికి యువ సైంటిస్టులుగా తయారవ్వాలని, అందు కోసం అవసరమయ్యే అన్ని రకాల ప్రయోగ పరికరాలు, శాస్త్రీయ అనుభవమున్న ఎక్స్ పర్టులను ఇచ్చామన్నారు.

అనంతరం ఆటోమేటిక్ చార్జింగ్ ఫర్ ఎలక్ట్రానిక్ వెహికిల్స్ అనే థీమ్ తో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన 9వ తరగతి విద్యార్థులు డి. సహస్ర , వి. సౌమిత్రి, గైడ్‌టీచర్, సైన్స్‌హెడ్ బదావత్ రమేష్ లను మెమెంటోలు, దుశ్శాలువాలతో సన్మానించి, అభినందించారు.ఈ కార్యక్రమంలో గుగ్రం రమేష్, ఎ.టి. ఎల్. ఇన్‌చార్జ్ ఆర్.కిరణ్‌కుమార్, అమర్‌నాథ్, నర్సయ్య, నరేష్, అరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
హనుమకొండ
శుక్రవారం | డిసెంబర్ 22, 2023 | www.navatelangana.com

బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



నవతెలంగాణ-శాయంపేట

బాలికలు లక్ష్యాలను ఎంచుకొని, లక్ష్య సాధన కోసం ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పరకాల సిడిపిఓ భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఇన్చార్జి హెచ్‌ఎం నాగలత అధ్యక్షతన బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించగా ముఖ్యఅతిథిగా సిడిపిఓ భాగ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. బాలురతో దీటుగా బాలికలు కూడా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ మంజుల, డీసీపీఓ సంతోష్, కేస్‌వర్కర్ విజయ్, ఫైనాన్స్ లిట్రసి అధికారి లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కాజీ పేట ట్రాఫిక్ సిఐ సుజాత

నవతెలంగాణ-కాజీపేట

ఈ నెల నిర్వహించే లోక్ అదాలత్ ను కేసులు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ సిఐ సుజాత తెలిపారు, ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని, మైనర్ డ్రైవింగ్ కేస్ లలో వాహనాలు సీజ్అయిన వాహనదారులు లోక్ అదాలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హనుమకొండ సెకండ్ క్లాస్ కోర్టులో ఈనెల 26 నుంచి 30 వరకు లోక్ అదాలత్ ఉంటుందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్, మైనర్ డ్రైవింగ్ కేసులు పెండింగ్లో ఉన్నవారు నేరుగా కోర్టుకు హాజరై పూర్తిగా కేసులను తొలగించుకోవాలన్నారు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు ఆధార్ కార్డ్, వాహనాల పత్రాలను, డ్రైవింగ్ లైసెన్సు కేసులో ఆధార్ కార్డ్, మీ సేవ లో లైసెన్సు కొరకు దరఖాస్తు చేసుకున్న రశీదు, మైనర్ డ్రైవింగ్ కేసులు ఉన్న వారు బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ జిరాక్స్‌ను తీసుకొని లోక్అదాలకు హాజరై తక్కువ జరిమానాలతో కేసులను తొలగించుకోవాలన్నారు.

ఫిష్ ఫాం కబ్జాపై తహాశీల్దారు సీరియస్

నవతెలంగాణ-హసన్‌పర్తి

గ్రేటర్ 65వ డివిజన్ ఎల్లాపూర్ శివారు ఫిష్ ఫాం కబ్జాపై తహాశీల్దారు చల్ల ప్రసాద్ సీరియస్ అయ్యారు. గురువారం 'నవతెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'ఎల్లాపూర్‌లో చేపల భూమి కబ్జాపై నీలి నీడలు'.. మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన శిలాఫలకం కూల్చివేత... భూ ఆక్రమణకు పాల్పడుతున్న కబ్జాదారులు... వివాదాస్పదంగా మారిన చేపల బావి.. అనే కథనంపై స్థానిక తహాశీల్దారు స్పందించారు. గురువారం మండల పరిధిలోని ఎల్లాపూర్ ఫిష్‌ఫాం, అంగడిస్థలంతో పాటు భీమారం శ్యామల చెరువు కబ్జా స్థలాలను పరిశీలించారు. ఎల్లాపూర్ షిప్ ఫాం కోసం ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన కట్టడాల కూల్చివేతపై మండిపడ్డారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ కట్టడాల కూల్చివేతకు పాల్పడడం నేరమన్నారు. కట్టడాల కూల్చివేతకు పాల్పడిన వారితో పాటు కూల్చివేతకు వినియోగించిన జేసీబీ, డోజర్‌లను సీజ్ చేసి వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు చర్యలు తీసకుంటున్నట్లు తహాశీల్దారు వెల్లడించారు. ప్రభుత్వ కట్టడాల కూల్చివేతలో భాగస్వాములైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగడి స్థలంలో పశువల దవఖాన, ప్రభుత్వ పాఠశాల, వ్యవసాయ శాఖ కార్యాలయాల కట్టడాలను పరిశీలించారు. పట్టేదారు వారసులు ప్రజాప్రయోజనాల కోసం దానం చేసిన భూమిని తిరిగి వారి వారసులు కబ్జాకు పాల్పడడం సరికాదని పట్టేదారు వారసులను హెచ్చరించారు. అంగడి స్థలం సర్వే నెంబర్ సర్వే చేయించి పట్టేదారు ప్రజాప్రయోజనాల కోసం ఇనాం ఇచ్చిన భూమి వివరాలను పరిశీలిస్తామని, రికార్డుల నమోదు, ఇనాం పత్రాలు, ప్రజాప్రయోజనాల కోసం నిర్మించిన కట్టడాలు, వాటి అనుమతులపై సమగ్ర దర్యాప్తు చేసి కబ్జాకు పాల్పడినట్లు తేలితే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజాప్రయోజనాల కోసం నిర్మించిన ఫిష్ ఫాం కట్టడాల కూల్చివేతకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు.

శ్యామల చెరువు కబ్జాపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశాలు జారీ

భీమారం శ్యామల చెరువులో అక్రమ నిర్మాణాలను తహాశీల్దారు చల్ల ప్రసాద్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్యామల చెరువు కబ్జా స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారి వెంట ఉన్న స్తానిక కాంగ్రెస్ నాయకులు కబ్జాకు గురైన స్థలాలలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించినట్లు తహాశీల్దారుకు వివరించారు. ఇటీవల కలెక్టర్ సిక్తాపట్నాయక్, వరంగల్ నగర పోలీసు కమిషనర్ రంగానాథ్ ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు శ్యామల చెరువులో నిర్మించిన కట్టడాల కూల్చివేతకు సీరియస్‌గా చర్యలను వేగవంతం చేసినట్లు స్థానికులు తహాశీల్దారు చల్ల ప్రసాద్‌కు వివరించారు.

మౌలిక సదుపాయలు కల్పించేందుకు కృషి



నవతెలంగాణ-మట్టెవాడ

40వ డివిజన్‌లోని ముకుందకాలనీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. గురువారం కాలనీ ప్రజల ఫిర్యాదు మేరకు ముకుందాకాలనీ సందర్శించగా స్థానికులు మిషన్ భగీరథ పైపులైన్‌లు లేవని, 60 ఫీట్ల రహదారి మూసివేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి విషయాన్ని మేయర్, కమిషనర్‌ల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. ఈ కాలనీ సందర్శనలో ఆంగోతు వీరన్న నాయక్, వాంకుడోత్ విజయ్, ఉల్లి నాగరాజు, ముత్తినేని నవీన్ గౌడ, సుభాష్, మూడు తిరుపతి, వాంకుడోత్ రాహుల్, ఉల్లి కవిత, రజిత, డాక్టర్ కష్ణవేణి, స్వప్న, లక్ష్మి లు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాల తయారీపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-శాయంపేట



చేనేత వస్త్రాల తయారీ విధానంపై విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించిన ట్లు ఏకశిలా ప్రైమ్‌స్కూల్ ప్రిన్సిపల్ కొండల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో చేనేత వస్త్రాల తయారీపై గురువారం దామెర మండలంలోని ఏకశిల ప్రైమ్ స్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి సిబిఎస్ఈ, స్టేట్ సిలబస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్రవంతి, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట

గ్రామాల్లో లేబర్ కార్డు కలిగి న ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో వైద్యశిబిరాలు ఏ ర్పాటు చేసి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఈ శిబిరాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిటిసి గజ్జి ఐలయ్య అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో గురువారం లేబర్ కార్డు కార్మికులందరికీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ ఇల్లందుల రవితేజ, ఏఎన్ఎం సుష్మిత, సిబ్బంది వెంకన్న, గ్రామస్తులు కందగట్ల తిరుపతి, పున్నం సాంబయ్య, కొంగర సుధాకర్‌లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-శాయంపేట

గ్రామ అభివృద్ధికి గ్రామంలో ని ప్రతిఒక్కరూ సహకరించా లని సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి అన్నా రు. మండలంలోని పత్తిపాక లో గురువారం సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించగా వివిధ శాఖలపై చర్చలు జరిగాయి. గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ పంప్‌హౌస్ వద్ద మోటార్ల సమస్యతో గత వారం రోజులుగా నీటి సమస్య తలెత్తిందని, అధికారులు మోటార్లు రిపేర్ చేసి నీటి సరఫరా చేస్తున్నారని త్రాగునీటికి సమస్య ఉండదని సర్పంచ్ తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రాజారామ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేల పునరుత్పాదక వ్యవసాయ పద్ధతులను పాటించాలి

రైతులు సాగు చేస్తున్న పంటల్లో అధిక దిగుబడిని సాధించడం కొరకు రసాయనిక ఎరువులు, పురుగుమందులు విచ్చలవిడిగా వాడడం వల్ల నేల పూర్తిస్థాయిగా నిస్సాహిత స్థితిలో చేరి సరైన దిగుబడులు సాధించలేకపోతున్నారని సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. మండలంలోని పత్తిపాకలో గురువారం ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం క్షేత్ర సిబ్బంది పోరండ్ల భానుమతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడారు.

మార్కెట్‌ల నుండి రూ.50 కోట్ల నిధుల మళ్లింపు

- స్థానిక మార్కెట్‌లలో మౌళిక వసతుల ఊసే కరువు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 10మార్కెట్‌ల నుండి రూ.50 కోట్లను నూతనంగా నిర్మిస్తున్న కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకుగాను గత ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ ఏనుమాముల, జనగామ, నెక్కొండ, పరకాల, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, తొర్రూరు, ములుగు, నర్సంపేట, భూపాలపల్లి మార్కెట్‌ల నుండి నిధులను మళ్లించింది. ఈ నిధులను కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 216 ద్వారా మార్కెట్ అధికారులను ఆదేశించింది. ఈ ఏడాది జూన్ 5వ తేదీన ప్రభుత్వం జీవో జారీ చేయగా ఆగస్టు మాసంలో ఈ నిధులను సంబంధిత మార్కెట్ కార్యదర్శులు కోహెడ మార్కెట్‌కు మళ్లించారు. ఈ మొత్తాన్ని రుణం రూపంలో ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇది ఎప్పుడు ఆ మార్కెట్ తిరిగి చెల్లిస్తుంది ? ఇచ్చిన రుణంపై ఎంత వడ్డీ చెల్లించాలి ? అనే అంశాలపై కార్యదర్శులలో భిన్నాభిప్రాయాలుండడం గమనార్హం. ఆయా మార్కెట్ పరిధిలో మౌళిక వసతుల మెరుగుదలకు నిధులను కేటాయించాల్సిన అధికారులు వాటిని పట్టించుకోకుండా కోహెడ మార్కెట్ నిర్మాణానికి నిధులను మళ్లించడం విమర్శలకు తావిచ్చింది. మార్కెట్‌లకు అనుబంధంగా లింకు రహదారులు, రైతుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు, టాయిలెట్స్ తదితర వసతులు కల్పించడానికి మార్కెట్ నిధులను వినియోగించవచ్చు. ఇలాంటి పనులు చేయాల్సివున్నా వాటిని పక్కన పెట్టి నిధులను మరో మార్కెట్ అభివృద్ధికి కేటాయించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 10 మార్కెట్‌ల నిధుల నుండి ఆయా మార్కెట్ కార్యదర్శులు గత రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.50 కోట్లను నూతనంగా నిర్మిస్తున్న కోహెడ మార్కెట్‌కు మళ్లించారు. గడ్డి అన్నారం మార్కెట్‌కు బదులుగా కోహెడలో రూ.350 కోట్లతో నూతనంగా పెద్ద పండ్ల మార్కెట్‌ను నిర్మించాలని గతంలో గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్కెట్ నిర్మాణానికి అన్ని మార్కెట్‌ల నుండి నిధులను కోహెడ మార్కెట్‌కు మళ్లించారు. ఈ నిధులను రుణం రూపంలో కోహెడమార్కెట్ అధికారులు ఇతర మార్కెట్‌ల నుండి తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ జీవోననుసరించి అధికారులు ఈ మేరకు నిధులను కోహడ మార్కెట్‌కు సమకూర్చారు. ఈ నిధులను మళ్లీ ఎప్పుడు చెల్లిస్తారనే విషయంలో మార్కెట్ కార్యదర్శుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. నిధులను ఇచ్చిన మార్కెట్ కార్యదర్శికి, కోహెడ పండ్ల మార్కెట్ కార్యదర్శి మధ్య ఒప్పందం కుదుర్చుకొనిఈ నిధులను ఇవ్వడం గమనార్హం. రుణం పేరిట ఇచ్చి న ఈ నిధులను తిరిగి వడ్డీతో కలిపి చెల్లించాల్సి వుంటుంది. ఈ విషయంలో మార్కెట్ కార్యదర్శులకు అవగాహన కొరవడింది. నెక్కొండ మార్కెట్ కార్యదర్శి ఈ రుణానికి వడ్డీ వుండదని చెప్పడం సందేహాలకు తావిస్తుంది.

కోహెడ మార్కెట్ నిర్మాణం పూర్తి చేసి మార్కెట్ లావాదేవీలు ప్రారంభమ య్యాకనే తీసుకున్న రుణానికి సంబంధించి కిస్తీల రూపంలో వడ్డీతో సహా చెల్లింపులు చేస్తారని తెలుస్తుంది. ఏదేమైనా ఆయా మార్కెట్ పరిధిలో రైతుల సౌకర్యార్థం చేయాల్సిన పనులకు నిధులు కేటాయించకుండా ఇతర మార్కెట్‌ల నిర్మాణానికి నిధులను మళ్లించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతు న్నాయి.

10 మార్కెట్‌ల నుండి నిధుల మళ్లింపు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 10 మార్కెట్‌ల నుండి హైద్రాబాద్‌లోని కోహెడలో పెద్దగా నిర్మిస్తున్న పండ్ల మార్కెట్‌కు రూ.50 కోట్లను మళ్లించారు. వరంగల్ ఎనుమాముల మార్కెట్ నుండి రూ.20 కోట్లు, ములుగు నుండి రూ.6 కోట్లు, నర్సంపేట నుండి రూ.6 కోట్లు, జనగామ నుండి రూ.4 కోట్లు, నెక్కొండ నుండి రూ.2 కోట్లు, పరకాల నుండి 2 కోట్లు, స్టేషన్‌ఘన్‌పూర్ నుండి 2 కోట్లు, తొర్రూరు నుండి 3 కోట్లు, వర్ధన్నపేట నుండి రూ.3 కోట్లు, భూపాలపల్లి నుండి రూ.2 కోట్లు మళ్లించారు.

మౌళిక వసతుల ఊసే లేదు..

వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు అనుబంధంగా వున్న రహదారులను మెరుగుపరచడానికి మార్కెట్ నిధులను కేటాయించాల్సి వుండగా, ఇందుకు భిన్నంగా జరిగింది. వరంగల్ ఎనుమాముల మార్కెట్ నుండి క్రిష్టియన్ కాలనీ వరకు రహదారిని నిర్మించినా, సైడ్ డ్రైన్స్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను నేటికీ పూర్తి చేయలేదు. దీంతో వాహన చోదకులు, ముఖ్యంగా మార్కెట్‌కు నర్సంపేట, మహబూబాబాద్ తదితర ప్రాంతాల నుండి వచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ రహదారి మూడు నియోజకవర్గాల పరిధిలో వున్న పెద్ద రహదారి కావడం గమనార్హం. అదేవిధంగా సికెఎం కాలేజీ నుండి మార్కెట్ వరకు వున్న రహదారిని బాగు చేయాల్సి వున్నా నిధులు కేటాయించకుండా పనులు చేపట్ట లేదు. దీంతో వాహన చోదకులు అనేక వ్యయప్రయాసాలకు గురవుతున్నారు.

వడ్డీ ఏముండదు.. : క్రిష్ణ మీనన్ రావు, మార్కెట్ కార్యదర్శి, నెక్కొండ

మార్కెట్ నిధుల నుండి రుణం రూపంలో కోహెడ మార్కెట్‌కు రూ.2 కోట్లు ఇవ్వడం జరిగింది. దీనికి సంబంధించి వడ్డీ ఏముండదు. కోహెడ మార్కెట్ నిర్మాణం పూర్తయ్యాక కిస్తీల చొప్పున రుణాన్ని తిరిగి చెల్లిస్తారు.

ఆర్‌బిఐ వడ్డీతో తిరిగి చెల్లింపులు : రాహుల్, మార్కెట్ కార్యదర్శి, వరంగల్ ఎనుమాముల

కోహెడ మార్కెట్ నిర్మాణం నిమిత్తం వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు ఇచ్చిన రూ.20 కోట్ల రుణానికి సంబంధించి ఆర్‌బిఐ మార్గదర్శకాల మేరకు వడ్డీతో చెల్లిస్తారు. కోహెడ మార్కెట్ నిర్మాణం పూర్తయ్యాకనే రుణాన్ని కిస్తీల రూపంలో చెల్లింపులు ప్రారంభమవుతాయి. ఆర్‌బిఐ ప్రస్తుత మార్గదర్శక సూత్రాల మేరకు యేటా 12 శాతం వడ్డీ వుంది.

ఛలో పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయండి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

జనవరి 12న ఢిల్లీలో జరగనున్న చలో పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు గురువారం నగరంలోని అశోక జంక్షన్ దగ్గర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతోకలిసి ముట్టడిని విజయవంతం చేయాలని వాల్ పోస్టర్స్ ను విద్యార్థుల చేతుల మీదుగా విడుదల చేశారు ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ అందరికీ ఉచిత విద్య, ఉపాధిని కల్పించాలని ఎస్ఎఫ్ఐ, ఇతర 16లౌకిక విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశ ప్రజలందరికీ ఉచిత విద్య ఉపాధి కల్పనకై ఛలో పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇంతవరకు గడచిన పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత తక్కువగా నిధులు కేటాయిస్తుందని ఆరోపించారు నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా విద్యారంగానికి అత్యంత ఎక్కువగా నిధులు కేటాయించాలని, ఈ సంవత్సరం బడ్జెట్లో కనీసం 20శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం దేశ విద్యరంగానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం గనుక అమలయితే చదువుకోవడం కాకుండా చదువు కొనుక్కోవడమే జరుగుతుందని ఆరోపించారు, ఏ కేంద్ర విశ్వవిద్యాలయాల్లో చూసుకున్న ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాలకు దురాక్రమనలకు దోపిడీకి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు గళం ఎత్తుతున్నాయని వాటిని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం యుజిసి ద్వారా ప్రజాస్వామికమైన సర్క్యులర్ లను రిలీజ్ చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థుల పైన విద్యార్థి సంఘాల పైన ఫైన్లు వేస్తూ దుర్మార్గమైన దుస్థితికి విశ్వవిద్యాలయాల స్థాయిని దిగదారుస్తున్నాయని ఆరోపించారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు నియంత్రతో పాలన మానుకోవాలని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ఇతర లౌకిక సంఘాలు నిర్వహించే చలో పార్లమెంట్ మార్చ్ ను మేధావులు ప్రజాస్వామికవాదులు యువత విద్యార్థులు యావత్ ప్రజానీకం అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ కమిటీ సభ్యులు జస్వంత్ కార్తీక్ పవన్ చరణ్ సందీప్ రాజ్ కుమార్ ప్రవళిక అనుష మానస వైష్ణవి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు చూపిన శాంతి మార్గంలో నడవాలి



నవతెలంగాణ-కాజీపేట

ఏసుక్రీస్తు చూపి శాంతి మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని టిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేట మండలం 47వ డివిజన్ పరిధిలోని సిద్ధు టెంట్‌హౌస్ వద్ద నాయకులు గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించగా ముఖ్యఅతిథిగా దాస్యం వినయ్‌భాస్కర్ హాజరయ్యారు, పాస్టర్ జాషువా, పాస్టర్‌మార్కు ప్రత్యేక ప్రార్థన అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వినయ భాస్కర్ మాట్లాడుతూ క్రైస్తవులు జరుపుకునే క్రిస్మస్ పండుగను ప్రపంచ దేశాలలో ఘనంగా జరుపుకుంటారని, ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరు నడవాన్నారు. ప్రజలందరిపై యేసు దీవెనలు ఉండాలని, ప్రపంచంలోనే అధిక ప్రజలు యేసు క్రీస్తును పూజిస్తారు అన్నారు, ఈ కార్యక్రమంలో 47 డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగ్‌రావు, రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్,నాయకులు ఎండి అఫ్జల్, కోంఢ్ర శంకర్, సిరిల్ లారెన్స్, మిట్టపల్లి రమేష్, హుస్సేన్, దువ్వ కనకరాజ్, బెదరకోట రంజిత్, ఎండి సోనీ, కాజీపేట పెయింటర్ యూనియన్ అధ్యక్షులు గబ్బెట ఎల్లెష్, మర్యాలా కృష్ణ, మైలారం శంకర్, నయీమ్ జుబేర్, దువ్వ నరేష్, రాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సర్పంచ్ చేయూత

శాయంపేట : జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థు లు సాయిశృతి, కే.లహరి అనే క్రీడా కారులకు శాయంపేట సర్పంచ్ కందగట్ల రవి ప్రయాణ ఖర్చుల కింద ఒక్కొక్క క్రీడాకారులకి రూ.1500ల చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన కనకం కట్టమల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించగా వార్డు సభ్యులు గుర్రం సుధాకర్, మామిడి భద్రయ్యలు గురువారం బాధిత కుటుంబా న్ని సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి 50 కిలోల బియ్యం అం దించారు. వారి వెంట కుమ్మరి రాజయ్య, జలుగూరి రవీందర్, మ హేందర్, మామిడి అశోక్, కుమార్, వార్డు సభ్యులు మామిడి శోభాశం కర్, కనకం సంతోష్, బొచ్చు ప్రశాంత్, జంగు శంకర్ పాల్గొన్నారు.

24న ఎస్సార్ ఎడ్యుకేషన్ అకాడమీ స్కాలర్ షిప్ టెస్ట్

నవతెలంగాణ-హన్మకొండ

ఈనెల 24వ తేదీన ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక స్కాలర్షిప్ టెస్టు జరుగుతుందని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదా రెడ్డి ప్రకటించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఎస్సార్ కాలేజీ ఆవరణలో చైర్మన్ వరదా రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024 -25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లో చేరి విద్యార్థిని విద్యార్థులకు ఇది గొప్ప అవకాశం అని తెలిపారు. జె ఇ ఇ అడ్వాన్స్/ మెయిన్స్ మరియు నీట్ లో 50 సంవత్సరాలు అపార అనుభవం కలిగిన ఎస్సార్ ఎడ్యుకేషనల్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే సాట్ క్యు ఫ్రీ స్కాలర్షిప్ టెస్ట్ ఎస్ ఆర్ ఎడ్యుకేషనల్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ వడ్డేపల్లి హనుమకొండలో డిసెంబర్ 24వ తేదీన (ఆదివారం) నిర్వహిస్తున్నామని ఈ స్కాలర్షిప్ టెస్ట్ పరీక్షలో అడవులైన విద్యార్థిని విద్యార్థులకు 100% స్కాలర్షిప్ పొందే సువర్ణ కోసం ఉంటుందని సాట్ క్యూ రాసిన ప్రతి విద్యార్థికి స్కాలర్షిప్ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. గత 50 సంవత్సరాల లో పటిష్టమైన ప్రణాళికలతో హై స్కూల్, జూనియర్ కాలేజ్ ,ఎంసెట్, ఐఐటి మరియు నీట్ లలో విద్యను అందిస్తూ రాష్ట్ర జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్న మా విద్యార్థులు ఈ సంవత్సరం ఐపీఈలో స్టేట్ మొదటి ర్యాంకు జి (మెయిన్)-23, జి (అడ్వాన్స్ డ్) నీట్ 23లో జాతీయస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సార్ విద్య సంస్థ డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

నవతెలంగాణ-నెక్కొండ



తెలంగాణ గురుకుల పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన వీరన్న గురువారం గుండెపోటుతో మృతి చెందారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం గత కొన్నేళ్లుగా నెక్కొండ లోని గురుకులపాఠశాలలో విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై బెల్లంపల్లి గురుకుల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం విధులు ముగించుకొని స్వగృహానికి బయలుదేరి మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో గుండెపోటుతో మృతి చెందారు. నెక్కొండ గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయురాలు వీరన్న మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి : డీఆర్‌డీఓ సంపత్‌రావు

- విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు
- కార్యాలయంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు





నవతెలంగాణ-వరంగల్

నిర్దేశించిన లక్ష్యాల్ని సకాలంలో పూర్తి చేయకుండా విధుల పట్ల అలసత్వం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, గ్రామీణ అభివృద్ధి అధికారి మట్టపల్లి సంపత్‌రావు సెర్ప్‌సిబ్బందిని హెచ్చరించారు. గురువారం డిఆర్డిఎ జిల్లా కార్యాలయంలో ఏపీఎంలకు సీసీలకు సెర్ప్ అన్ని విభాగాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డిఆర్డిఓ మట్టపల్లి సంపత్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 30 వరకు నిర్దేశించిన లక్ష్యాలను 100శాతం పూర్తి చేయుటకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పనిచేయని వివోఏలకు జీతాలు ఆపాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే సీసీలకు చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రామైక్య సంఘాల ద్వారాబ్యాంకు లింకేజీ శ్రీనిధి ద్వారా పీఎం ఎఫ్ ఎంఈ, పీఎంఈపీ ఫుడ్ ప్రాసెసింగ్ మొదలగు రుణాల ద్వారా ఆదాయ అభివద్ధి కార్యక్రమాలను నెలకొల్పి ఆర్థిక సుస్థిరతను సాధించుటకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం డిఆర్డిఓ మట్టపల్లి సంపత్ రావు నేతత్వంలో క్రైస్తవ సోదరులు కార్యాలయంలో కేక్ కట్ చేసి సీట్లు పంపించేశారు ఒకరికొకరు అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సమావేశంలో అడి షనల్ డిఆర్డిఓ గొట్టే శ్రీనివాస్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు (డిపిఎం)లు మునిగాల దయాకర్, సరిత, అనిత, ఏపీఎంలు సుధాకర్, వేణు, ప్రేమ్ రాజ్, గీత, ఏపీఎంలు సీసీలు అశోక్, సుధాకర్, కష్ణమూర్తి, వేణు, కుమారస్వామి, కొమురయ్య రమేష్, సునీత, సుజాత, శోభ, వనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-జనగామ



జనగామ పురపాలక కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పర్మార్ పింకేశ్ కుమార్ గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మున్సిపల్ కార్యాలయ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, పరిశుభ్రత, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ప్రజా ఆరోగ్యంపై తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత విభాగాల సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పురపాలక సంఘం పరిధిలోని ప్రతి ఇంటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పౌర సేవలు అందించాలని పరిశుభ్రత తడి చెత్త-పొడి చెత్త సేకరణ, ప్రజా ఆరోగ్యం, టౌన్ ప్లానింగ్ విభాగం తదితర విభాగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ బి.చంద్రమౌళిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో జనగామ పురపాలక సంఘం చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళి, సంబంధిత విభాగాల సిబ్బంది ఉన్నారు.

విద్యాభ్యాసంతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలి: ఎస్సై ప్రవీణ్

నవతెలంగాణ-లింగాలఘనపురం



యువత విద్యాభ్యాసం తోపాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని నెల్లుట్ల గ్రామంలో బైపాస్ రోడ్డు లో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐత కిషన్ తెలిపారు. లింగాల గణపూర్ బైపాస్ రోడ్‌లో ఉదయం 9 గంటల నుంచి పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా లింగాలఘనపురం ఎస్సై బి. ప్రవీణ్ పచ్చాజెండా ఊపి ప్రారంభించారు. సుమారు వందకు పైగా సైక్లింగ్ క్రీడాకారులు ఈపోటీలో పాల్గొన్నారు. ఇందులో విజేతలు సిద్దిపేట జిల్లా లో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈసైక్లింగ్ పోటీలకు అతిధులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఓలంపిక్ సెక్రటరీ కైలాష్ యాదవ్, జనగాం జిల్లా సైక్లింగ్ అధ్యక్షులు ఇట్యాల శ్రీనివాస్, జన్ను సారంగపాణి, జన్ను రజని, పీఈటీ రవిలు పాల్గొన్నారు. అనంతరం విజేతలను అభినందిచారు.



పాలిటెక్నిక్ కళాశాలలో ఎగ్జిబిషన్

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం సృజన టెక్ ఫెస్ట్-2023కి గాను ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈసందర్భంగా నాలుగు కళాశాలల విద్యార్థులు వారి విభాగాల్లో ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. అధ్యాపకులు కె.రాజేష్, అనిల్‌యాదవ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించగా, ప్రతిభా ప్రదర్శనలో మొదటగా నిలిచిన వరంగల్ కళాశాల, రెండో స్థానంలో చేర్యాల, మూడో స్థానంలో జీపీడబ్ల్యు, వరంగల్, నాలుగవ స్థానంలో స్టేషన్ ఘనపూర్ కళాశాలలు ఉన్నాయి. వీరికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.పోచయ్య, ప్రోగ్రాం ఇంచార్జీ నవీన్‌కుమార్, రామకృష్ణ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడ గిరిజన ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ నాయక్



నవతెలంగాణ-పాలకుర్తి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన లంబాడీలు అహర్నిశలు కృషి చేశారని, కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన లంబాడా గిరిజన ఎమ్మెల్యేలకు మంత్రి పదవీలో చోటు కల్పించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సురేష్ నాయక్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేవలాల్ సేన మండల అధ్యక్షుడు కునసోత్ ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో గల రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ తో కలిసి సురేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం గిరిజనులు ఐక్యమత్యంతో పని చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేశారని, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను ఏటువంటి పోటీ లేకుండా భారీ మెజారిటీ తో గెలిపించడంలో గిరిజన లంబాడీలు ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున నలుగురు లంబాడ గిరిజన ఎమ్మెల్యేలతో పాటు ఒకరు ఆదివాసి ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు. మంత్రివర్గంలో ఆదివాసీలకు ప్రాధాన్యత ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడా గిరిజనులకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సేవాలాల్ సేన మండల ఉపాధ్యక్షుడు ధరావత్ గోరియానాయక్, భూక్య యాకూబ్‌నాయక్, భూక్య హరి సింగ్ నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు శాంతి మార్గాన్ని మానవాళి అనుకరించాలి: బిషప్ డానియల్ కళ్యాణపు



నవతెలంగాణ- స్టేషన్ ఘనపూర్

ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గాన్ని మానవాళి అనుసరించాలని ఎక్లేసియా మినిస్ట్రీస్ అధినేత, రెవ. బిషప్ డానియల్ డి. కళ్యాణపు సూచించారు. నియోజకవర్గ కేంద్రంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఎక్లేసియా మినిస్ట్రీస్ బెతెల్ ప్రార్థన మందిరం దైవ సేవకులు పాస్టర్ పాల్ రాజ్ ఆధ్వర్యంలో గురువారం వైభవంగా జరిగాయి. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా డానియల్ కళ్యాణపు హాజరై ప్రసంగించారు. ఏసు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరూ జరుపుకునే క్రిస్మస్ వేడుకల్లో దేవుని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలన్నారు. క్రీస్తు జననం నాటిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. ఈకార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు గన్ను నర్సింహులు, సెయింట్ థామస్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డా.కేసీ జాన్ బన్నీ, ఇవాన్, పాస్టర్ల ఫెలోషిప్ నాయకులు మారపాక బాలస్వామి, నంగునూరి టెక్నా, ఆనందం, ప్రభుదాస్, సీమోను, క్రిష్టఫర్, బాబు, నతనియేల్, తిమోతి, చాల్స్, డేవిడ్, ప్రశాంత్, టింకుల్, అనూప్ రూబెన్స్, తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో గురువారం ఎంపీపీ చిట్ల జయశ్రీ అధ్యక్షత నిర్వహిస్తున్న మండల సర్వసభ్య సమావేశం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా మండల సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ జయశ్రీ తెలిపారు. ఈసమావేశానికి ముందు ఇటీవల మృతి చెందిన జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈసమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ స్పెల్ బీ రీజనల్ లెవెల్‌కి ఎంపికైన చరిష్మా

నవతెలంగాణ-లింగాలఘనపురం



మండలంలోని వనపర్తి పివిఆర్ పాఠశాల లో ఐదవ తరగతి చదువుతున్న బుడిగే చరిష్మా ఐదో తరగతి విద్యార్థిని. ఇటీవల ఓ దినపత్రిక వారు నిర్వహించిన ఇంగ్లిష్ స్పెల్ బి జిల్లా స్థాయి పరీక్షలో ప్రతిభ కనబరిచి రీజినల్ లెవెల్ కి సెలెక్ట్ అయింది. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ పప్పు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, విద్యార్థిని విద్యార్థులు చరిష్మాను అభినందించి మరింత శ్రమించి రాష్ట్రస్థాయికి సెలెక్ట్ కావాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఇలాంటి పరీక్షలను నిర్వహించి విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి సహకరించిన దినపత్రిక యాజమాన్యానికి విద్యార్థిని తల్లిదండ్రులను అభినందించారు.

తొలి పండుగకే ప్రచారం కరువు..



పట్టించుకోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు

వల్మిడి వైష్ణవ ఆలయంపై చిన్న చూపు

రేపే ముక్కోటి ఏకాదశి

నవతెలంగాణ-పాలకుర్తి

వల్మిడిలో గల వైష్ణవ శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ పునర్‌ప్రతిష్టాపన తరువాత తొలిసారిగా జరుపుకునే ముక్కోటి ఏకాదశికి ప్రచారం కరువైంది. పురాతన వైష్ణవ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని అన్ని హంగులతో భద్రాద్రి తరహాలో అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో అప్పటి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక చొరవ చూపారు. సుమారు రూ.50 కోట్ల వ్యయంతో ఆలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. సెప్టెంబర్ 1 నుండి 4 వరకు ఉత్సవాలు నిర్వహించి సీతారామచంద్ర స్వామి పునర్‌ప్రతిష్టాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పునర్‌ప్రతిష్టాపన కార్యక్రమం తర్వాత 41 రోజులకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఉత్సవాలు నిర్వహించాల్సి ఉండగా పట్టించుకోకపోవడం గమనార్హం. పునర్‌ప్రతిష్టాపన తరువాత వల్మీడిలో గల శ్రీసీతారామచంద్రస్వామి వైష్ణవ ఆలయంలో తొలిసారిగా జరుపుకునే ముక్కోటి ఏకాదశికి హంగులు, ఆర్భాటాలు చేయడంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. వైష్ణవ ఆలయాల్లోనే ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహిస్తారు. వైష్ణవ ఆలయంగా పేరు గాంచిన వల్మీడిలో గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలకు ఎలాంటి ప్రచారాలు నిర్వహించకపోవడంతో భక్తుల సంఖ్య తగ్గే పరిస్థితి ఉంది. అతి పవిత్రంగా భావించే వైష్ణవ ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సందర్శకులు భక్తులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకుంటారు. ఉత్తర ద్వారా దర్శనానికి ఆలయ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విశేషం. వైష్ణవ ఆలయంగా పేరుగాంచిన వల్మిడిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులను కేటాయించకపోవడం పై దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఆలయ ప్రతిష్టాపన తరువాత భక్తుల రద్దీ పెరిగింది తప్పా ఆదాయ వనరులపై దృష్టి పెట్టడం లేదని చర్చ జరుగుతుంది. భద్రాద్రి తరహాలో వలిమిడి ఆలయాన్ని అభివృద్ధి చేసినప్పటికీ అర్చకులు లేకపోవడంతో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ధూప దీప నైవేద్యం కోసం ఏర్పాటు చేసిన అర్చకుడు సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించకపోవడం గమనార్హం. ఆలయ దర్శనానికి భక్తులు వచ్చినప్పటికీ ఆలయ అభివృద్ధిలో భక్తులను భాగస్వాములు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సెప్టెంబర్ 1 నుండి 4 వరకు జరిగిన పునర్‌ప్రతిష్టాపన ఉత్సవాలు వేలాదిమంది భక్తులు ఆలయ సందర్శనకు వచ్చారని, కేవలం రూ. 1,50,000 మాత్రమే హుండీ ఆదాయం వచ్చిందని, ఆలయానికి వచ్చే భక్తులకు అవగాహన కల్పిస్తే మరింత ఆదాయం పెరుగుతుందని, వైష్ణవ ఆలయంగా పేరుగాంచిన వల్మిడి ఆలయంలో సరిపడా అర్చకులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుచున్నారు.

23న ముక్కోటి ఏకాదశి: ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న

మండలంలోని వల్మిడిలో గల శ్రీసీతారామచంద్ర స్వామి వైష్ణవ ఆలయంలో ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం ఉంటుందని శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో లక్ష్మిప్రసన్న తెలిపారు. గురువారం ఈవో మాట్లాడుతూ 23న జరిగే ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం ఉంటుందని, ఈనెల 22న శుక్రవారం సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాట్లను పూర్తి చేస్తామని తెలిపారు. ముక్కోటి ఏకాదశి విజయవంతానికి కరపత్రాలు ముద్రించామని తెలిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా నిర్వహించే ఉత్తర ద్వారా దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో సామర్థ్యాలను సాధించాలి: కలెక్టర్

నవతెలంగాణ-జనగామ



విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో సామర్థ్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో మెరుగైన విద్యాసామర్థ్యాలు సాధించడానికి అమలు చేస్తున్న ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను గురువారం స్థానిక ధర్మకంచ జడ్పీ పాఠశాలలో జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య ఆకస్మికంగా సందర్శించారు. కార్యక్రమాల అమలు తీరును ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులను వివిధ సబ్జెక్టులపై వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. అలాగే ఉన్నతి, లక్ష్య బోధనా అభ్యసన ప్రక్రియలపై విద్యార్థుల అవగాహనను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలపై ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గది బోధనలో విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాలు కల్పించడానికి దృశ్య మాధ్యమాలను, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డును తరచుగా ఉపయోగించాలని సూచించారు. తద్వారా విద్యార్థులలో అవగాహన మెరుగవుతుందని ఉపాధ్యాయులకు సూచించారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావడానికి సరైన ప్రణాళికతో విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము, ఏఎంవో శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద నివారణకై పోలీసుల ప్రత్యేక ప్రణాళిక

రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-రఘునాథపల్లి

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారులు అతినిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. గురువారం రఘునాథపల్లి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి నేపథ్యంలో కేంద్రంలో సిఐ కార్యాలయం వద్ద స్థానిక విలేకరులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువతీ యువకులు వాహనాలు నడిపేటపుడు అతివేగం అజాగ్రత్త వల్ల తర్జుమా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు యువత కచ్చితంగా ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా వెళుతూ హెల్మెట్లను పెట్టుకోవాలని ఆయన సూచించారు. లింగాల గణపురం రఘునాథపల్లి చిల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందని ఆయన తెలిపారు. ప్రయాణికులు ప్రజలు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా వెళుతూ ప్రయాణం చేయాలని పలు సూచనలు చేశారు. ప్రతిరోజు హైవేపై పోలీస్ వాహనాలను తనిఖీ చేయడంతో పాటు లైసెన్స్ లేని వ్యక్తులను గుర్తించి జైలుకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని నియమనిబంధనల ప్రకారం ప్రయాణం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రఘునాథ్ పెల్లి సబ్ ఇన్స్పెక్టర్ రఘుపతి, సిబ్బంది మండల విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్



రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన మండలకేంద్రంలో గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన పట్ల రేణుక, స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట రోడ్డు దాటుతుండగా, అటుగా వెళ్తున్న ఓ ప్రయివేట్ స్కూల్ పాఠశాల బస్సు ఢీకొట్టడంతో వెనుక టైరు కిందపడగా, కాళ్లకు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి సహోదరుడు యాకయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టపడి చదివితే గణితం సులభం

నేడు జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

విద్యార్థులు గణితం అంటే భయపడుతూ ఉంటారు. అర్థమైతే దానంత సులువైన సబ్జెక్టు మరొకటి ఉండదని, లెక్కలు అంటే భయంతో కాకుండా ఇష్టంతో నేర్చుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ప్రతి మనిషికి నిత్యం గణితం ఎంతో అవసరమవుతుంది. ఇలాంటి గణితం సబ్జెక్టు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చేసిన కృషిని గుర్తు చేసుకుందాం. నిత్య జీవన విధానంలో గణితం మానవుడి మేధస్సును అత్యున్నత స్థాయికి తెచ్చే గణిత శాస్త్రం నిరక్షరాస్యులైన, విద్యావంతులైనా గణితాన్ని ఉపయోగించకుండా ఒక్కరోజైనా గడపడం కష్టం. అలాంటి గణితం పట్ల ప్రస్తుతం విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి గణితాన్ని అలవాటు చేసుకునే పనిలో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. సులువైన సూత్రాలు, ఉదాహరణలు బోధించడంతోపాటు ఇతర ప్రాక్టికల్స్, బొమ్మలతో కూడిన లెక్కలను నేర్పుతున్నారు. తద్వారా సులువుగా గణితాన్ని నేర్చుకొని గణితం పట్ల విద్యార్థులకు ఉన్న భయాన్ని విడనాడుతున్నారు. గణితంలో రాణించాలంటే ఎన్నో కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. అబాకస్ వేదిక మాస్ లాంటి సులువైన కోర్సులను విద్యార్థులకు అందిస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలకు బొమ్మలతో గణితాన్ని నేర్పిస్తారు. కేవలం చేతి వేళ్ళతోనే కూడికలు, తీసివేతలు, గుణకారం వంటి ప్రాథమిక గణితాన్ని సులువుగా చేసే పద్ధతులను సాధన చేయిస్తారు. దీంతో విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వచ్చేసరికి గణితమంటే భయం తొలగిపోతుంది.


భారతదేశ కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన ఘనత శ్రీనివాస రామానుజన్‌ది..

గణిత పితామహుడుగా శ్రీనివాస రామానుజన్ ఎంతో గొప్ప పేరుందారు. డిసెంబర్ 22న తన జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం జరుపుకుంటారు. ఆయన పూర్తి పేరు శ్రీనివాస్ రామానుజన్ అయ్యంగార్. ఆయన 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఉత్తర ఆర్కాట్ జిల్లా ఈరోడు లో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఈయన 12వ ఏటనే గణితంలో అసాధారణ గుర్తింపు పొందారు. 15 ఏళ్లకే రామానుజంలోని తెలివితేటలు ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్యూచ్ సిడ్జ్ కార్ రాసిన "సినాప్సిస్" అందులో ఆల్ జీబ్రా, అనాలిటీ కల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6,165 సిద్ధాంతాలు ఉన్నాయని అంటుంటారు.

రామానుజన్ సేవలకు 2011లో ప్రకటన..

గణిత శాస్త్రంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 2011లో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. రామానుజన్ 125వ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అప్పటినుంచి కళాశాలలు, పాఠశాలల్లో గణిత దినోత్సవాలను నిర్వహిస్తూ విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించేందుకు సదస్సులు, టాలెంట్ టెస్టులు నిర్వహిస్తూ బహుమతులు అందజేయడంతో పాటు, ఉత్తమ గణిత ఉపాధ్యాయులు అధ్యాపకులను సత్కరిస్తున్నారు. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ





గణిత శాస్త్ర సిద్ధాంతాలు, సూత్రాలను అందించిన, అత్యుత్తమ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం. మానవ నాగరికత చరిత్రకు గణితాన్ని పరిచయం చేసిన ఆర్యభట్ట, భాస్కరుడు ఆతదనంతరం రామానుజన్ వంటి గణిత మేధావి మరణాంతరం.. అంతటి ప్రతిభగల గణిత శాస్త్రవేత్తలను భారతదేశం తయారు చేసుకోలేకపోయింది. భవిష్యత్తులోనైనా ఈ లోటును నేటి విద్యార్థులు భర్తీ చేయగలరని ఆశిద్దాం.

గణితంలో ఉత్తమ ఫలితాల సాధకుడు రాధాకృష్ణ

మండలంలోని శివునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం స్కూల్ అసిస్టెంట్ టీచర్ గా పని చేస్తున్న వీరమల్ల రాధాకృష్ణ పాఠశాల విద్యార్థులు గణితంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా అనునిత్యం సాధన చేస్తున్నారు. గణిత ఉపాధ్యాయునిగా 2009 నుండి విధులు నిర్వహిస్తున్న తను 2018లో శివునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ కు వచ్చారు. మూసా పద్ధతిలో కాకుండా ప్రయోగాత్మకంగా విద్యా బోధన చేయడం, చాప్టర్ వైస్ గా పిల్లలతో ప్రయోగాలు చేయించడం గణిత సూత్రాలు, సిద్ధాంతాలు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ విద్యార్థులకు గణితంపై భయాన్ని పోగొట్టి ఆసబ్జెక్టులో ఉత్తమ మార్కులు సాధించేలా కృషి చేస్తున్నారు.

ఈ పాఠశాల విద్యార్థులు మండల టాపర్స్

గడిచిన ఐదు ఏండ్లలో రాధాకృష్ణ బోధనతో ఈ పాఠశాల నుంచి గణితంలో విద్యార్థులు మండల టాపర్స్ గా నిలుస్తున్నారు. ప్రతీ ఏడాది తెలంగాణ మ్యాథ్స్ ఫోరం టాలెంట్ టెస్ట్ లో మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటుతున్నారు. 2020 బ్యాచ్ లో పాఠశాల నుంచి మాలోత్ సురేష్ అనే విద్యార్థి ఐఐటీ సీటు సాధించారు. విద్యార్థులకు ఐఎఫ్పీ బీ డిజిటల్ ద్వారా గణిత బోధన చేస్తూ పిల్లలకు గణితంపై ఆసక్తిని పెంచుతున్నారు. ప్రతీ ఏడాది పాఠశాలలో గణిత దినోత్సవ సందర్భంగా విద్యార్థుల ద్వారా పలు గణిత ఎగ్జిబిట్లను తయారు చేయిస్తూ వారిలోని సజనాత్మకతను వెలికి తీస్తున్నారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకోసం ప్రణాళికా యుతంగా చదివేలా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

మన చుట్టూ ఉన్నదంతా గణితమే

వి.రాధాక్రిష్ణ, గణిత ఉపాధ్యాయులు, శివుని పల్లి

గణితం లేకుండా మనం ఏమి చేయలేము. మన చుట్టూ ఉన్నదంతా గణితమే. ఈవిధంగా గణితం నాగరికతకు అర్థం లాంటిది అని చెప్పొచ్చు. జీవితంలో రకరకాల అంచనాలను సరిగా అర్థం చేసుకోవడానికి లెక్కల్ని ప్రేమించు. సమాజాభివృద్ధికి అవసరం లేని ఈసమీకరణమైన సరే శూన్యంతో సమానం. మన జీవితంలో లెక్కలతో కూడినది ఎంత కష్టమైనా చివరికి అది ఎంత సంక్లిష్టమైన చివరకు పరిష్కారం లెక్కల తో లభిస్తుంది.

పేదలకు కార్మెల్ కాన్వెంట్ స్కూల్ చేయూత

నవతెలంగాణ-పాలకుర్తి



పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి అభినందనీయమని కార్మెల్ కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ లిజ్‌బెత్ అన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో గల కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, చదువుచున్న విద్యార్థిని, విద్యా ర్థులు నిరుపేదలకు దుస్తులతో పాటు బియ్యం, నిత్యవసర సరుకులను అందజేశారు. ఈసందర్భంగా లిజ్‌బెత్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మార్గాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థినివిద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రజా శ్రేయస్సు కోసమే ఏసుక్రీస్తు తపనపడ్డాడని, ఏసుక్రీస్తు మార్గం అందరికీ ఆదర్శమన్నారు. ఏసుక్రీస్తు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పేదల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులు చదు వుతోపాటు పేదలను ఆదుకునేందుకు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మెర్లీన, బ్లేస్సి, జ్యోత్స్న, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

నవతెలంగాణ-పాలకుర్తి

మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన భాషబోయిన కొమరయ్య దుక్కిటెద్దు గురువారం విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ నేలబారున ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పచ్చ గడ్డి ఉండడంతో మేతకు వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఎద్దు విలువ రూ.75000 ఉందని తెలిపారు. వ్యవసాయ సీజన్ సమయంలో దుగ్గిటెద్దు మృతి చెందడంతో కొమరయ్య కుటుంబీకులు బోరున విలపించారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్‌సఫార్మర్లను పంట చేల నుండి మార్చాలని, బాధిత రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



మండలంలోని చాగల్ గ్రామానికి చెందిన గాండ్ల అండాలు (50) మరణించగా గురువారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈకార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సత్తు రవి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చేపూరి ప్రభాకర్, కడియం సోషల్ మీడియా ఇంచార్జీ సమ్మయ్య గ్రామ యూత్ అధ్యక్షుడు పొన్న రాజేష్, గాండ్ల చిన్న కొండెల్లి, అజయ్, శ్రీను, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మురళినాయక్‌ను కలిసిన వార్డు సభ్యురాలు



నవతెలంగాణ-నెల్లికుదురు

మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్‌ను వార్డు సభ్యురాలు మంజుల యాకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రావిరాల గ్రామ అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. గురువారం నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌ను శాలువాతో సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాగ్రామ అభివృద్ధి కోసం మీ వంతు కృషి చేయాలని తెలిపారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రేఖ అశోక్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు కత్తుల కృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జిలకర యాలాద్రి, గోరంట్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ శివాజీపై అవిశ్వాస తీర్మానం



నవతెలంగాణ-గార్ల

మండల ఎంపీపీ మూడ్ శివాజీ చౌహాన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడుతూ మండల పరిధిలోని ఎంపీటీసీలు గురువారం ఆర్డీవో అలివేలుకి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా మండల ఎంపీటీసీలు జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంకు వెళ్ళి అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించాలని ఆర్డీవో అలివేలుకు రాత పూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు. మండల ప్రజాపరిషత్‌కు సంబంధించిన పాలన వ్యవహారంలో ఎంపీపీ శివాజీ చౌహాన్ మిగిలిన ఎంపిటీసి సభ్యులకూ సమాచారం అందించకుండా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని వినతి పత్రంలో తెలిపారు. అవిశ్వాస తీర్మానాన్ని అందించిన వారిలో ఎంపీటీసీలు మాలోతు వెంకట్ లాల్, కట్టె బోయిన శ్రీనివాస్, ధనియాకుల రాజకుమారి, బట్టు నాగరాజు, మన్నెపల్లి సుగుణాదేవి, అలోతు ఫరేంగన్, పసుపులేటి సుజాత, బానోత్ మంజుల తదితరులు ఉన్నారు.



గిరిజన హాస్టల్ స్థలానికి సరిహద్దులు నిర్ణయించాలని వినతి

నవతెలంగాణ-కేసముద్రంరూరల్

కేసముద్రం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్ కు ప్రభుత్వం కేటాయించిన స్థలానికి సరిహద్దులు నిర్ణయించాలని పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ బొట్టు రమేష్ డిమాండ్ చేశారు. గురువారం కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ శ్రవణ్ కు ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన వెంట ఎస్ఎంసీ వైస్ చైర్మన్ అజ్మీర బాలు, కమిటీ సభ్యుడు భూక్య రవి తదితరులు ఉన్నారు.

నూతన కార్మిక ఒప్పందం చేయాలి



నవతెలంగాణ-కేసముద్రంరూరల్

కేసముద్రం మండలం వ్యవసాయ మార్కెట్ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్‌కు ఎఐసీటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం గురువారం అందజేశారు..ఈ సందర్భంగా ఏఐసీటియు జిల్లా అధ్యక్షులు కంచ వెంకన్న మాట్లాడుతూ ఈనెల 31 తో పరిశ్రమలు ట్రేడింగ్ కంపెనీలకు సంబంధించిన వ్యాపారస్తుల, హమాలీ కూలి, బండి హమాలీ కార్మికుల ఒప్పందం పూర్తవుతున్నదన నూతన రేట్లు జనవరి 1నుండి2024 అగ్రిమెంటు చేసుకొని అమలు చేయవలసి ఉన్నదని, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నీలం సుహాసిని, మార్కెట్ అధికారులు మధ్యవర్తిత్వం వహించి అమలయ్యేలా చూడాలని ఆయనకోరారు. లేనిఎడల వ్యాపారస్తుల సరుకుల లోడింగ్ తోలకాలను నిలిపివేస్తామని, పరిశ్రమలలో ట్రేడింగ్ కంపెనీలలో పనులు నిలిపివేస్తామని ఆయన కార్మికుల పక్షాన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హమాలి కార్మికులు వారు వేల్పుల వెంకన్న, సముద్రాల మల్లయ్య, రమణ బోయిన సురేష్ , ధరావత్ వీరన్న, గుగులోతు లక్ష్మణ్ , బిచ్చు నాయక్, భానోత్ వీరన్న, సామ శ్రీనివాసరెడ్డి ,బానోత్ కిషన్, ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జాటోత్ బిచ్చా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానం మరొకరికి ప్రాణదానం



నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్

తాను చనిపోతూ మరొకరికి బతుకునివ్వడం గొప్ప విషయమని ఉపసర్పంచ్ దీకొండ యాకన్నగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ఎలికట్ట గ్రామంలో ఇటీవల కొమ్ము సత్యనారాయణ ప్రమాదవశాత్తు హైదరాబాద్‌లో ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ కామినేని హాస్పిటల్ లో మరణించడంతో తదనంతరం హాస్పిటల్ యజమాన్యం వైద్యులు తన శరీరలో కొన్ని అవయవాలు పనిచేస్తున్నాయని మీరు అవయవాలు దానం చేసి నలుగురికి ప్రాణదానం చేసిన వారు అవుతారని వారి కుటుంబ సభ్యులకు చెప్పగానే వారు కూడా ఒప్పుకొని తాను చనిపోతూ నలుగురికి ప్రాణదానం చేసిన వారి కుటుంబానికి తనవంతు సహాయం అందించి మిగతావారు కూడా ఆర్థికసాయం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ పార్టీ ఇంచార్జ్ మాలోత్ సునీత, రాజేందర్, వెంకట సాయిలు, అన్నపూరం వెంకన్నగౌడ్, బంధు వెంకన్న, భోగ కమలాకర్, కనుకుంట్ల కుమారస్వామి, కొమ్ము యాకన్న, కొమ్ము శ్రీను, ధీకొండ సుధాకర్, ధీకొండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-నెల్లికుదురు

మండలంలోని ఎర్రబెల్లి గూడెం గ్రామంలో మండల పరిషత్ నిధులతో సిసి రోడ్ల పనులను ప్రారంభించినట్లు ఆ గ్రామ ఎంపీటీసీ బత్తిని అనిల్ గౌడ్, గ్రామ సర్పంచ్ బొమ్మెర అశోక్ గౌడ్‌లు తెలిపారు ఎర్రబెల్లి గూడెం గ్రామంలో బండారి వెంకన్న ఇంటి ముందు నుండి మోటపోతుల వెంకటయ్య ఇంటి వరకు గురువారం సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు భూముల శ్రీనివాస్, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బొమ్మెర అనిల్, గడ్డల రాము, పబ్బోజు శేఖర్, మహ్మద్ రషీద్, గొల్లపెల్లి సురేష్, రాజబోయిన రామూర్తి, బూర్గు యాకయ్య, గొల్లపెల్లి సోమయ్య, బొమ్మగాని భిక్షపతి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సిరాజ్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ కు చెందిన ఎండీ.సిరాజ్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శించి ఓదార్చిచారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ఆయన భరోసా కల్పించారు. టిఆర్ఎస్ పార్టీకి మంచి సేవలు చేసిన సింరాజ్‌ను మర్చిపోలేమన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎండీ.అయూబ్ పాషా, సిరాజ్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



మొక్కల పేరుతో రూ.లక్షల అవినీతి..



తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

మండల ప్రజా వేదిక సభలో డీఆర్‌డీఏ ఏపీడీ శాంత కుమారి

నవతెలంగాణ-మరిపెడ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పనులలో అధికారుల నిర్లక్ష్యం ఉందని మండల స్థాయి అధికారుల పారదర్శకత లోపించడం వల్లనే మొక్కల పేరుతో రూ.లక్షల అవినీతి జరిగినట్లు నివేదికల ద్వారా బయటకు వస్తున్నాయని, మరిపెడ మండలంలో జరిగిన ఉపాధి పనుల టీఏ, కార్యదర్శులు సరైన రికార్డులను మెయింటెనెన్స్ చేయలేదని వారి నిర్లక్ష్యంతో జరిగిన తప్పులకు వారే బాధ్యత వహించాలని, రీకవరికి ఆదేశిస్తున్నట్లు డిఆర్డిఏ ఏపీడీ శాంతకుమారి అన్నారు. గురువారం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం ముందు 13వ విడత మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీపీ గుగులోతు అరుణ రాంబాబుల అధ్యక్షతన రెండో రోజు కొనసాగింది. 2020 నవంబరు ఒకటి నుండి 2023 మార్చి 31 వరకు సుమారు18,22 కోట్ల రూపాయల పనులు జరిగినట్లు సామాజిక తనిఖీ నివేదికలో వెల్లడించారు. గతవారం రోజుల నుండి మండలంలోని 44 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందాలు పనులను గుర్తించి ఆడిట్ చేశారు.అనంతరం ఆయా గ్రామాలలో జరిగిన అవినీతి అక్రమాలను పరిస్థితులను బట్టి గ్రామసభలో డిఆర్పీలు తెలపకపోయిన జిల్లా స్థాయి అధికారుల ముందు మాత్రం జరిగిన అవినీతిని తనిఖీ బృందాలు కుండబద్దలు కొట్టారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాంతకుమారి మాట్లాడుతూ ఉపాధి పనులను తనిఖీ చేస్తున్నారా .. చేస్తే రికార్డుల మేయింటనెన్స్ ఎందుకు చేయడం లేదని ఏపీవో, టెక్నికల్ సిబ్బందిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ బృందానికి రికార్డులు ఎందుకు ఇవ్వటం లేదని పంచాయతీ కార్యదర్శులను ఆమె ప్రశ్నించారు. దంటకుంటతండా, ఎల్లంపేట, తాళ్లవుకల్, మూల మర్రితండ, డిఎస్ఆర్ జండాల తండా, ఎడ్జర్ల, భూక్యా తండా, లూనావత్ తండా, అబ్బాయిపాలెం, గ్రామాలలో మొక్కల పేరుతో లక్షల అవినీతి జరిగినట్లు డిఆర్పీలు సభలో వెల్లడించారు. ఈ డబ్బులను రికవరీ చేయిస్తామని వారి తప్పులకు వారే బాధ్యత వహించాలని ఏపీడి శాంత కుమారి స్పష్టం చేశారు. అవసరమైతే మళ్లీ జిల్లా అధికారుల చేత అవినీతిపై విచారణ చేయటానికి ఆదేశిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరిగాయని తాళ్ల ఉకల్, దంటకుంటతండా, భూక్యతండ చెందిన ఉపాధి కూలీలు మండల సభలో ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వకపోవడంతో డబ్బులు ఎన్ని పడుతున్నాయో తెలియడం లేదని కొన్ని గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దరిదాపు అన్ని గ్రామాలలో అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్, మల్టీ లేయర్ ప్లాంటేషన్ లో మొక్కలు నాటి బిల్లులు ఎత్తారు. కాని ప్రదేశానికి వెళ్లి పరిశీలించగా ఎక్కడ కూడా 20 శాతం కంటే ఎక్కువ మొక్కలు లేవని మొక్కల పేరుతో లక్షల రూపాయలు కార్యదర్శులు, టిఏ లు లక్షల రూపాయల వృధా చేసినట్లు డిఆర్పిలు వారి నివేదికల ద్వారా బట్టబయలు చేశారు. ఎవరు తప్పులకు వారే బాధ్యులని అన్ని రీకవరికి రాస్తున్నట్లు ఏపీడి పేర్కొన్నారు. కాగా చనిపోయిన వారి పేర్లతో వర్క్ ఐడీల డిమాండ్ నోటీసులో ఎందుకొస్తున్నాయన్నారు. మల్టీపర్పస్ వర్కర్లకు ఉపాధి పనులు కల్పించవద్దని తెలిసినా కూడా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నావ్ అంటూ ఏపీవో మంగమ్మ పై ఏపీడి శాంత కుమారి ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరించింది. మీలాంటి వారు ఉండటం వల్లే ఉపాధి పనులపై ప్రజలలో తప్పుడు సమాచారం వెళుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జాగ్రత్తతో పనులు నిర్వహించాలని. లక్షల రూపాయలు ప్రజలకు చేరకుండా మొక్కల పేరుతో వృధా కావడానికి వీలు లేదన్నారు. డిసెంబర్31 వరకు మొక్కలు ఏర్పాటు చేయకపోతే , చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవోలు కే.ధన సింగ్, సింగారపు కుమార్, ఏవిఓ ఎన్.యాకూబ్, అబూడ్స్ మేన్ జిల్లా అధికారి బెస్త ఆదాం, ఎస్ఆర్పీలు, సురేష్, నరసయ్య, డిఆర్పీలు, పంచాయతీ కార్యదర్శిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికై ప్రజా పోరాటాలు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న

నవతెలంగాణ-మరిపెడ



కార్మిక సమస్యలు పరిష్కారం కోసం కార్మిక వర్గ పోరాటాలు నిర్వహించక తప్పదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న అన్నారు. గురువారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఆడిటోరియంలో సిఐటియు జనరల్ బాడీ సమావేశం కొండా ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు)యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలని పర్మినెంట్ చేయాలని, బిల్డింగ్ రంగ కార్మికులకు టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ వెహికల్ ఇవ్వాలని, హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. అట్లాగే కార్మిక, కర్షక సమస్యలను పరిష్కరించాలని ఎన్నో సంవత్సరాల నుంచి సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్న ప్రభుత్వాలు పట్టించకపోవడం వల్ల ఆ ప్రభుత్వాలకు నిరసన, ధర్నాల ద్వారా సమ్మెలతో ప్రభుత్వాలకు తెలియపరచిన ప్రభుత్వాలు పట్టించకపోవడం ప్రభుత్వాలకు ఓట్ల రూపంలో తగిన బుద్ధి చెప్పారన్నారు. కార్మికుల పోరాటాల నిరసన సెగలు తగిలి ప్రభుత్వాలు ఆయా పార్టీలు మళ్లీ ప్రభుత్వంలోకి రాలేకపోయాయి కనుక ఇప్పటికైనా ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్మికుల సమస్యలు తెలుసుకొని తక్షణమే కార్మిక సమస్యల పరిష్కార మార్గంలోకి అడుగులేసి కార్మికులకు అండగా ఉండాలని కోరారు. గత కొద్ది సంవత్సరాల నుండి అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని, అలాగే ఉద్యోగ భద్రత కల్పించి వారిని పర్మినెంట్ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు ద్వారా ప్రభుత్వాలకు వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం చూపకుండా రేపు మాపు అని కాలయాపన చేశారని సంఘం జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తక్షణమే స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి వారిని అదుకోవాలని వారు కోరారు. అలాగే హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి హమాలి కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని, బిల్డింగ్ రంగ కార్మికులకు గత ప్రభుత్వం టూ వీలర్ వెహికల్స్, ఫోర్ వీలర్ వెహికల్స్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా కాలయాపన చేసిందన్నారు. అందుకు ఆప్రభుత్వాన్ని కాదని కార్మికులందరూ కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని వచ్చారు. కనుక తక్షణమే బిల్డింగ్ రంగ కార్మికులకు టు ఆర్ ఫోర్ విల్లర్స్ వెహికల్స్ ని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతనాన్ని అమలు చేసి పని భారాన్ని తగ్గించి వారిని కూడా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ, బిల్డింగ్ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ఉమా, కలమ్మ, బిల్డింగ్ యూనియన్ నాయకులు యాదగిరి, రాములు, ముత్తయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

సదరం ధ్రువీకరణ పత్రం కొరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలి: కలెక్టర్ శశాంక

నవతెలంగాణ-మహబూబాబాద్

సదరం ధ్రువీకరణ పత్రం పొందేవారు ఈనెల 22వ తేదీ నుండి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక నేడు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుండి దరఖాస్తుదారులు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని అన్నారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావలసినవారు మండలాల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోను, పట్టణ పరిధిలోని వారు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోను సంబంధిత డాక్టర్లతో వైకల్య నిర్ధారణ పరీక్ష చేయించుకొని ఉండాలన్నారు. అనంతరం ఏదైనా మీసేవ సెంటర్కు వెళ్లి సదరం వైకల్యం అంచనా, ధ్రువీకరణ కొరకు తేదీలను నిర్ణయించుకొని స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ బుకింగ్ కొరకు వైకల్య ధ్రువీకరణ పత్రం తోపాటు ఆధార్ కార్డును వెంట తీసుకొని వెళ్లాలన్నారు. మీసేవ చార్జి క్రింద 35 రూపాయలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందన్నారు. స్లాట్ ప్రకారం దరఖాస్తుదారు తమ రసీదుతో వైకల్య ధ్రువీకరణ పత్రం మెడికల్ రిపోర్టులను తీసుకొని మెడికల్ క్యాంపు హాజరు కావలసి ఉంటుందని నిర్వాహకులు పరిశీలించి పార్ట్ ఏ లో వివరాలను నమోదు చేస్తారన్నారు. సదరం గుర్తింపు సంఖ్య నమోదు చేస్తారని వైద్యులచే అంగవైకల్యం అంచనా వేయడం జరుగుతుందని తదుపరి చదువు సదరం సర్టిఫికెట్ అందజేసే తేదీని తెలియజేయడం జరుగుతుందన్నారు. సదరం ధ్రువీకరణ పత్రం కొరకు జిల్లాలో 130 మంది డిసెంబర్ 27వ తేదీ కాలపరిమితి ముగుస్తున్నందున రెన్యువల్ చేయించుకోవలసి ఉంటుందని అదేవిధంగా మరో 20 మంది కొత్తగా సదరం సర్టిఫికెట్ పొందేవారు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈనెల 27వ తేదీన 150 స్లాట్లతో సదరం క్యాంపు నిర్వహణ కొనసాగుతుందన్నారు మొదటిసారి స్లాట్ బుకింగ్ చేసుకునేవారు తమ పేరు చిరునామా మొదలగు వివరాలు పార్ట్ ఏ ఫారంలో నమోదు చేస్తారని తదనంతరం జిల్లాలో ఏ రోజున ప్రభుత్వ ఆసుపత్రి మోబాదులో జరిగే మెడికల్ క్యాంపుకు హాజరు కావాలో స్లాట్ బుకింగ్ చేసి వివరాలతో కూడిన రసీదు ఇవ్వబడుతుందన్నారు. దివ్యాంగులు గతంలో సాధారణ ధ్రువీకరణ పత్రం కలిగి ఉంటే వైకల్యం అంచనా వేయబడి అర్హత శాతం కంటే తక్కువగా ఉన్న వారి స్లాట్ బుకింగ్ తిరస్కరించడం జరుగుతుందన్నారు.

ఈనెల 23వ తేదీన జాబు మేళా

ఈనెల 23వ తేదీన ఫీల్డ్ స్టాఫ్, మార్కెటింగ్ సేల్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శశాంక నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఐ డి ఓ సి లోని జిల్లా ఉపాధి కార్యాలయం రెండవ అంతస్తులోని రూమ్ నెంబర్ 25 లో శ్రీ సాయి అగ్రి టెక్నాలజీస్ సహకారంతో 25 ఫీల్డ్ స్టాఫ్ ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ పాసై ద్విచక్ర వాహనం తో పాటుగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, సుమారు 21 నుండి 32 సంవత్సరంల లోపు వయస్సు కలిగి ఉండాలని వేతనం 10,000 తో పాటు టిఏ, డిఏ చెల్లించడం జరుగుతుందన్నారు. అర్హత ఆసక్తి కలిగిన స్త్రీ పురుష అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు తో పాటుగా నాలుగు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలను తీసుకుని ఈ జాబు మేళలో పాల్గొనాలని సూచించారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువతి యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు సందీప్ సెల్ నెంబర్ 9908768489 ను సంప్రదించవచ్చునన్నారు.

వరంగల్ పార్లమెంట్ బరిలో రిజిస్ట్రార్ హరికోట్ల రవి

నవతెలంగాణ-మహబూబాబాద్



వరంగల్ పార్లమెంట్ బరిలో కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం ఖమ్మం జిల్లా ముదిగొండ కు చెందిన హరి కోట్ల రవి మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ గా 13 సంవత్సరాలు పనిచేశారు. గత రెండు సంవత్సరాల క్రితం పదోన్నతిపై జిల్లా రిజిస్ట్రార్‌గా వరంగల్‌కు బదిలీపై వెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన ఉద్యోగ సంఘాలను సమీకరించి పోరాటం చేయడంలో ముందున్నారు. గెజిటెడ్ అధికారుల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులుగా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గా, మాల మహానాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రవికుమార్‌కు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు స్వచ్ఛంద సంస్థల్లో ప్రజాసంఘాలలో మంచి పరిచయాలున్నాయి. అన్ని రాజకీయ పార్టీల తోటి ఆయనకు సంబంధాలు ఉన్నాయి గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో వెనక ఉండి పనిచేస్తున్నారు గతంలో పలుసార్లు కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించినప్పటికీ ఆయనకు దక్కలేదు. ఈసారి ఎస్సీ నియోజకవర్గమైన వరంగల్ పార్లమెంట్ నుంచి ఎలాగైనా టికెట్ దక్కించుకొని పోటీ చేయడానికి సుముఖంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అద్దంకి దయాకర్‌కు హరి కోట్ల రవి ఆప్తుడుగా ఉన్నారు. గత కొంతకాలంగా ఆయన కాంగ్రెస్ పెద్దలతో టచ్‌లో ఉన్నారు. ఈక్రమంలో వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి హరికోట్ల రవి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.



అంకిత భావంతో విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు

నవతెలంగాణ-పెద్దవంగర

ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వర్తించినప్పుడే సమాజంలో వారికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని చిట్యాల కాంప్లెక్స్ హెచ్ఎం అర్రోజు విజయ్ కుమార్ అన్నారు. చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయులుగా సేవలు అందించి గెజిటెడ్ హెచ్ఎంగా పదోన్నతి పొందిన మడిపెద్ది వెంకన్న, బదిలీ అయిన ఉపాధ్యాయుడు మచ్చ సోమయ్యలను పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించారు. పాఠశాల బలోపేతం కోసం వారు అహర్నిశలుగా పని చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సురేందర్, శివకుమార్, ప్రభాకర్, ఆంజనేయులు, యుగంధర్, అరుణ, గీత, కరుణ, నరేష్, సురేష్, హరిసింగ్, రాయల్, మధు, సీఆర్పీలు వేముల సంతోష్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-గార్ల

నేడు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపిడివో రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండల ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమయ పాలన పాటించి సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎంపీటీసీల ఫోరం సంఘం మండల అధ్యక్షులుగా వెంకట్‌లాల్ ఎన్నిక

నవతెలంగాణ-గార్ల



ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు గా మండలంలోని ముల్కనూరు ఎంపీటీసీ మాలోతు వెంకట్‌లాల్ ను ఎంపీటీసీ సభ్యులు మండల కేంద్రంలో గురువారం జరిగిన ఎంపీటీసీ సభ్యుల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వెంకట్‌లాల్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఎంపీటీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఈసమావేశంలో ఎంపీటీసీలు కట్టె బోయిన శ్రీనివాస్, భట్టు నాగరాజు, ధనియాకుల రాజకుమారి, మన్నెపల్లి సుగుణాదేవి, ఆలోత్ ఫరేంగన్, పసుపులేటి సుజాత, బానోత్ మంజుల తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వద్దు.. పర్యావరణ పరిరక్షణనే ముద్దు



నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని కొత్తపేట సెంటర్‌లో గ్రీన్ గ్రేస్ ఫర్ రిసోర్స్ ఎన్విరాన్మెంట్ ఎనేబుల్ ఇన్ నేచర్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దేశాయి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరూ కలిసి ప్లాస్టిక్ ని అంతమొందించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి ప్లాస్టిక్ వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. దీనికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి చికెన్ షాపులు, కిరాణాషాపులు, పండ్ల దుకాణాలు, కూరగాయల షాపులు, హోటల్స్ మొదలైనవి ప్లాస్టిక్ బదులుగా స్టీల్ బాక్సులు గాని చేతి సంచులు వాడాలని తెలియజేశారు. ఇందులో భాగంగా క్లాత్ బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈయొక్క ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. పర్యావరణాన్ని రక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు కేవీ రామమనోహర్‌రావు, పర్యావరణ నెట్‌వర్క్ కన్వీనర్ రమేష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సదరం స్లాట్ బుకింగ్: ఎంపీడీవో

నవతెలంగాణ-పెద్దవంగర

డిసెంబర్ నెలలో జరిగే సదరం క్యాంపు స్లాట్ బుకింగ్ కోసం నేడు మధ్యాహ్నం 12 నుండి మీసేవాలో అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్ 130, కొత్తవి 20 స్లాట్ లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. స్లాట్ ప్రకారం దివ్యాంగులు రసీదు తో పాటుగా, వైకల్యం పరీక్ష జీరాక్స్, వ్యక్తిగత వైద్య నివేదికను తీసుకుని, సదరం క్యాంపుకు హాజరు కావాలని తెలిపారు. దివ్యాంగులు సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బడీడు పిల్లలను బడికి పంపాలి

నవతెలంగాణ-పెద్దవంగర



బడీడు పిల్లలను బడికి పంపాలని ఉప్పెరగూడెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో సీఆర్పీ నిరంజన్‌తో కలిసి బడి బయట పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బడీడు పిల్లలను తమ తల్లిదండ్రులు తప్పనిసరిగా బడిలో చేర్పించాలన్నారు. పిల్లలకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. వారు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యను, ప్రభుత్వం ప్రోత్సాహిస్తున్న విధానాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో పస్తం నవ్యను గురించి, ఆమె తండ్రి జంపులుతో కలిసి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో 6వతరగతిలో చేర్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నెల్లికుదురు

మండలంలోని రతిరామ్ తండా గ్రామ శివారు ఆవులేగా తండాలో ఇటీవల మరణించిన గుగులోతు కౌసల్య కుటుంబాన్ని సందర్శించి పరామర్శించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ నాయక్ తెలిపాడు. మృతి చెందిన వ్యక్తికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె మృతి చెందడం బాధాకరమన్నారు. ఆగ్రామంలో అందరితో కలిసిమెలిసి కష్టసుఖాల్లో పాలుపంచుకునే వ్యక్తి అని అన్నారు. ఆమె ఎంతోమందికి ఎంతగానో అండగా నిలిచి సహాయం చేసిన వ్యక్తి అని అన్నారు. అలాంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమన్నారు మృతి చెందిన కుటుంబాలకు ప్రతి ఒక్కరు అండగా ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో దేవేందర్, వెంకన్న రమేష్, శ్రీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

24, 25న 'మహణీయుల జాతర'

నవతెలంగాణ-మహాదేవపూర్



ఈ నెల 24, 25న మహారాష్ట్ర సీరోంచ లో జరిగే సాహు మహారాజు, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జాతరను విజయవంతం చేయాలని కావేరె శంకర్ పిలుపునిచ్చారు. గురు వారం సిరోంచ నుండి వచ్చిన బంతేజీల కు స్వాగతం పలికి అంబేద్కర్ ఆలోచన ఆశయాల వారసులు పోస్టర్లు రిలీజ్ చేశారు. అనంతరం మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ నాలుగు రాష్ట్రాలను కలుపుకుని బాబాసాహెబ్ అంబేద్కర్ వారసులు ప్రతి సంవత్సరం జరుపుకునే ఈ జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గం పోచన్న, దాగం వలీహైదర్, నిగ్గురి కిష్టయ్య, మోతే సాంబయ్య, తూటీచర్ల దుర్గయ్య, బెల్లంపల్లి సురేష్, సచిన్, మెరుగు లక్ష్మన్, గోమాస రాజబాపు, జిముడా రాజబాపు, నాగరాజు, సుమన్, రవితేజ, కుమ్మరి చిన్న లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో సెమీ క్రీస్మస్ వేడుకలు : పాస్టర్ రాజయ్య

నవతెలంగాణ-మహాదేవపూర్



మండలంలోని ఎడపల్లి గ్రామంలో పాస్టర్ కుమ్మరి రాజయ్య ఆధ్వర్యంలో .గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నజారేయుడై యేసు క్రీస్తు జన్మదిన సందర్భంగా దైవజనుల మధ్యలో దైవ వర్తమానం అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు చేకూర్తి చందు, నల్లభుగా ఆదాం,తాండ్ర దేవదాస్, గోగుల శాంతి, గోగుల సామ్యూల్, జాను, ముత్తయ్య, గ్రామ పెద్దలు కుమ్మరి బాపు, మోతే సమ్మయ్య, కుమ్మరి రాజమౌళి, మాజీ ఉపసర్పంచ్ మోతే సాంబయ్య, యువకులు కుమ్మరి రాజ్ కుమార్, సల్మాన్ రాజు సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గొత్తి కోయ గర్భిణీలకు ప్రత్యేక పోషణ అందించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రీ పాటి

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ



మారుమూల ఏజెన్సీ ప్రాంతాలు, అడవుల్లో నివాసం ఉంటున్న గొత్తి కోయ గర్భిణీలకు, బాలింతలు, చిన్నారులకు పోషక పదార్థాలను అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ సమావేశం గదిలో గురువారం మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిని ఈపీ ప్రేమలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ములుగు జిల్లా వ్యాప్తంగా గొత్తికోయ గూడాల పరిధిలో కొనసాగుతున్న అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్ శ్రీజ , ఐటీడీఏ పీవో అంకిత్ లు పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ గొత్తి కోయ గిరిజనులకు అందుతున్న అంగన్వాడి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రం పరిధిలో గ్రామానికి దూరంగా నివసిస్తున్న గొత్తికోయలను కూడా గుర్తించాలన్నారు. చిన్నారులకు రక్తహీనత లోపించకుండా ఐసీడీఎస్ ద్వారా అందించే పోషక పదార్థాలను పంపిణీ చేయాలన్నారు. గుత్తి కోయ గుంపులను గుర్తించి అంగన్వాడి కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో అంకిత్ మాట్లాడుతూ గొత్తికోయ గుడాల్లో నెలకు ఒకటి రెండు సార్లు సందర్శించి పోషకార ఆవశ్యకత గురించి అంగన్వాడి టీచర్లు అవగాహన పరచాలన్నారు. వారికి స్పెషల్ డ్రైవ్ కింద సప్లమెంటరీ న్యూట్రిషన్ను ఫుడ్ సప్లై చేయడానికి సంబంధించిన నివేదికను సిద్ధం చేయాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సిడిపిఓలు హేమలత, మల్లీశ్వరి, శిరీష సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివద్ధి కోసం కార్యదర్శులు కషి చేయాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటిడిఏ



గ్రామాల అభివద్ధిపై పంచాయతీ కార్యదర్శులు దష్టి పెట్టాలని అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ మీటింగ్ హల్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు శ్రీజ మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల పంచాయతీ కార్యదర్శులతో పల్లె ప్రగతి నివేదికలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పల్లె ప్రగతిలో భాగంగా నర్సరీ లు, సెగ్రిగేషన్ షెడ్లులు, శానిటేషన్, పల్లె ప్రకతి వనాలు స్థితిగతులపై ఆరా తీశారు. గ్రామ పంచాయతీ లలో పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు గ్రామానికి వెళ్లి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టి పథకాలను సమర్థవంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశం లో జిల్లా పంచాయితీ అధికారి కొండ వెంకయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి స్వరూప, ఎంపీడీఓ కుమార్, మండల పంచాయతీ అధికారులు హనుమంతరావు, శ్రీకాంత్, రామకష్ణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్‌లను డీఎంహెచ్ఓ పరిశీలన

నవతెలంగాణ-మొగుళ్ళ పల్లి



మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నూతనంగా నిర్మించే సబ్ సెంటర్‌లను, సబ్ సెంటర్ కోసం ఏర్పాటు చేసిన స్థలములను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ గురువారం పరిశీలించారు. రంగాపూర్, ఇసిపేట, మొగుళ్ల పల్లి,మొట్ల పల్లి, పెద్ద కోమటిపల్లి,ఆకిన పెల్లి, రాఘవరెడ్డి పేట, గ్రామాలలో నూతనంగా నిర్మించే సబ్ సెంటర్ లను,సబ్ సెంటర్ నిర్మాణ కోసం ఏర్పాటు చేసిన స్థలాలను సందర్శించి పరిశీలించారు. సబ్ సెంటర్ లను తొందరగా పూర్తి చేస్తామని తెలిపారు.కరోనా విజంభి స్తున్నందున అన్ని సబ్ సెంటర్ల పల్లె దవాఖాన డాక్టర్ల్, ఏఎన్ఎమ్స్, ఆశాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన రాష్ట్రంలో కరోనా విజంభి స్తున్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని బయటకు వెళ్ళినప్పుడు మా స్కులు ధరించాలని, చేతులను శుభ్రంగా కడుక్కోని, డిస్టెన్స్ పాటించా లన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సునీత, వైద్యాధికారిణి నాగరాణి, జిల్లా వైద్య సిబ్బంది దినేష్, వివిధ గ్రామాల సర్పంచులు, అన్ని సబ్ సెంటర్ల పల్లె దవాఖాన డాక్టర్లు,హెల్త్ అసిస్టెంట్ బిక్షపతి, అన్ని సబ్ సెంటర్ల ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహనా సదస్సు

- జిల్లా బాలల పరిరక్షణ విభాగం

నవతెలంగాణ- తాడ్వాయి



బాలల బంగారు భవిష్యత్తుకై హక్కులపై అవగాహన బాలలపై లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం - 2012, బాల్య వివాహాల నిరోధక చట్టం - 2006పై గురువారం కాటాపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ములుగు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలలు విద్యార్థి దశలో మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటిని సాధించాలని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయాలని తెలిపారు. ఐసిపిఎస్ సోషల్ వర్కర్ జ్యోతి బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై లైంగిక వేధింపులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితరవాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో కాటాపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు జాఫర్‌అలీ, శ్రీనివాస్, జీవన్ లాల్, జైపాల్, పద్మజ, సంధ్య రాణి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

100శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీసీఈబీ అసిస్టెంట్ కార్యదర్శి భద్రయ్య

నవతెలంగాణ-టేకుమట్ల



మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులందరూ ఏప్రిల్ లో జరిగే 10వ తరగతి పరీక్షలలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని డీసీఈబీ అసిస్టెంట్ కార్యదర్శి శనిగరపు భద్రయ్య అన్నారు. గురువారం ఆయన స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ శ్రేణిలో ఉండాలనే ఉద్దేశం తోనే జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్ర, జిల్లా విద్యాశాఖ అధికారి రామ్‌కుమార్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహి స్తున్నామని అన్నారు. పాఠశాల పని దినాల్లో ఉదయం 8:30గంటల నుండి 9:30 గంటల వరకు, తిరిగి సాయం త్రం 4:30గంటల నుండి 5:30గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిం చాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యజమాన్య కమిటీల సహకారంతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని కార్యా చరణ అమలు చేయాలని అన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌కు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్ లో సంతకాలేవీ..?

- వైద్యశాలలో 24 గంటలు అందుబాటులో ఉండాలి
- వైద్యాధికారి కి ఐటీడీఏ పీఓ ఆదేశం

నవతెలంగాణ-వెంకటాపురం



రిజిస్టర్ లో 20 రోజులుగా వైద్యాధికారుల సంతకాలు లేవు వారు విధులకు హాజరు కావడం లేదా అంటూ ఏటూరునాగారం ఐటీడీఏ పిఓ అంకిత్ వైద్యాధికారి శివాజీని అడిగి తెలుసుకున్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రులకు వచ్చే రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. రక్తనమూనా సేకరణ,ఏజన్సీలో జ్వరాల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వార్డులను పరిశీలించి, ఇన్‌పేషెంట్‌ల సమస్యలు, సకాలంలో చికిత్స అందించడం, రోజువారీ అవుట్ పేషెంట్లకు చికిత్స, మందులు సరఫరా తదితర అంశాలపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. 20 రోజులుగా రిజిస్టర్‌లో వైద్యుల సంతకాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. సెల్ కౌంటర్ పనితీరు, రియాజెంట్ల లభ్యత, టెస్టింగ్ కిట్‌లు, రోజువారీ నిర్వహించే పరీక్షలు మొదలైన వాటిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు మరియు సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌తో సమన్వయం చేసుకుంటూ రియాజెంట్‌లు మరియు టెస్టింగ్ కిట్‌ల బఫర్ స్టాక్‌ను సరిగ్గా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అంబులెన్స్ డ్రైవర్‌ను 24 గంటలూ అందుబాటులో ఉండాలని, ఎలాంటి ఆలస్యం చేయకుండా అత్యవసర కేసులకు హాజరు కావాలని ఆదేశించారు.

సింగరేణి కార్మికులు వేసే ఓటు భవిష్యత్తుకు కొత్త రూటు

- ఎస్సీఈయు(సిఐటియు) ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు

నవతెలంగాణ-కోల్‌బెల్ట్



ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను ఉద్దేశించి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో ఉదయించే సూర్యునిపై కార్మికులు వేసే ఓటు భవిష్యత్తుకు కొత్త రూటు అని అన్నారు. గురువారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసి, కేటీకే-1 గనులలో ఆ సంఘం భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్ కు ముఖ్య అతిథిగా హాజరైన మంద నరసింహారావు మాట్లాడుతూ కార్మికుల సేఫ్టీ విషయంలో, రక్షణ పరికరాలు అందించడంలో యజమాన్యం గుర్తింపు,ప్రాథమిక సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. సింగరేణిలో సీఐటీయూ ఉదయించే సూర్యున్ని గెలిపిస్తే రక్షణ కమిటీలలో సీనియర్ ఎఫిషియన్సీ కార్మికులతో సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. సింగరేణిలో మార్పు రావాలి అంటే సీఐటీయూ రావాలి అనే నినాదంతో డిసెంబర్ 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలోతమ సంఘంను గెలిపించాలని కోరారు. సింగరేణిలో కార్మిక సంఘాల పాత్ర ఎలా ఉంటదో నిరూపిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయకులు రాజేందర్, రమేష్ ,ప్రసాద్ ,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు జనవరి 12న ఛలో పార్లమెంట్

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గుగులోత్ రమేష్‌నాయక్

నవతెలంగాణ - ములుగు



దేశంలో విద్యారంగ పరిరక్షణకు, విద్యారంగాన్ని కాపాడాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అందరికీ చదువు, అందరికీ ఉపాధి కల్పించాలని, జాతీయ స్థాయి మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్ రద్దు చేయాలని జనవరి 12న దేశవ్యాప్తంగా 16 విద్యార్థి సంఘాలను కలుపుకొని ఛలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా అధ్యక్షులు గుగులోతు రమేష్ నాయక్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కమిటీ ఆధ్వరంలో గురువారం చలో ఢిల్లీ గోడ పత్రికను ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా అధ్యక్షులు గుగులోతు రమేష్ నాయక్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాల్లో మతోన్మాద భావాజాలాన్ని జొప్పిస్తూ విద్యారంగాన్ని కాషాయీకరిస్తున్నారనీ అన్నారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలగించి, జాతీయోద్యమంతో సంబంధం లేని హెగ్డే వార్, విడి సావర్కర్ల చరిత్రను పొందుపరుస్తున్నారని అన్నారు. ఎన్ఎల్‌టిఏ వంటి సంస్థలను రద్దు చేయాలని, జాతీయ స్థాయి పోటీ పరీక్షలను ఈ సంస్థ ద్వారా నిర్వహించడం ద్వారా విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా బడా, బహుళ జాతి కంపెనీల ప్రైవేటు యూనివర్సిటీలను ఆహ్వానిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నీరుగార్చే కుట్ర చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రూ.7800 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లకు డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వాలని, రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలకు సరిపడా నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్. కమలాకర్. తరుణ్. రంజిత్ అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లో విద్యార్థుల భవిష్యత్తు

- సమయపాలన పాటించాలి
- జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ

నవతెలంగాణ-ఏటూరునాగారం



ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఉందని ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల గదులు అపరిశుభ్రంగా ఉండడంతో ఉపాధ్యాయుల పనితీరుపై మండిపడ్డారు. పాఠశాలను, గదులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని వెల్లడించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్ పరిశీలించి సిబ్బంది గైరార్హజర్‌పై మండిపడ్డారు. ఎంఈఓ సురేందర్ వచ్చి తమను కలవాలని ఆదేశాలు ఇచ్చారు.

సాధారణ డెలవరీల సంఖ్య పెంచాలి

మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలోని జనరల్, డెలవరీ వార్డులను శ్రీజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాధారణ డెలవరీల సంఖ్య పెంచాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న వార్డులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లేబర్ రూమ్(ప్రసూతి) గది, ఎస్ఎంసీయూ స్పెషల్ న్యూ బాన్ కేర్ యూనిట్ నవజాత శిశువుల సేవల వార్డు చిన్నపిల్లల వార్డును సందర్శించారు. అందులోని సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్యుల సేవల గురించి ఆసుపత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స తీసుకుంటున్న వారికి అందుతున్న ఆహార సరఫరా గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనిల్, ప్రధాన ఉపాధ్యాయులు సాంబశివరావు, హెడ్ సిస్టర్ నాగదేవి, ల్యాబ్ టెక్నీషియన్ భాస్కర్, టీచర్లు విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మేడారంలో ముమ్మరంగా విద్యుత్ లైన్ మరమ్మతులు

నవతెలంగాణ- తాడ్వాయి



మేడారంలో నిరంతర విద్యుత్ సేవలందించడంలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు మిగతా శాఖల అధికారుల కంటే ముందస్తుగా పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎన్పీడీసీఎల్ ఎస్సీ భూపాలపల్లి బి మల్సూర్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్పీడీసీఎల్ డీఈ పులుసం నాగేశ్వరరావు పర్యవేక్షణలో 33కేవీ పస్రా నుండి మేడారం వరకు గల విద్యుత్ లైన్‌ను ముమ్మరంగా మరమ్మతులు నిర్వహించారు. పస్రా నుండి మేడారం వరకు గల విద్యుత్తు లైన్‌లో ప్రతి కరెంటు పోల్ ఎక్కి చెక్ చేస్తున్నారు. 33కేవీ పిన్ ఇన్సు లేటర్స్ చెక్ చేసి డ్యామేజీ ఉన్న వాటిని తొలగించి, కొత్త వాటిని ఏర్పాటు చేశారు. కొన్ని ఏరియాలో విద్యుత్ లైన్ లకు చెట్లు కొమ్మలు తగులుతున్న సందర్భంగా కొమ్మలను కొట్టి లైన్ క్లియర్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మేడారం వనదేవతల జాతర్లకు మెరుగైన నిరంతర విద్యుత్ అందించడంలో విద్యుత్ శాఖ ముందంజలో ఉన్నామని తెలిపారు. వన దేవతల సన్నిధిలో సేవలందించడం ఎంతో ఆహ్లాదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 20 మంది ఇంజనీర్లు, డి ఈ, ఏఈ, సబ్ ఇంజనీర్ లు, 44 మంది విద్యుత్ సిబ్బంది, అన్ మాండ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన ఎంపీపీ శ్రీదేవిసుధీర్‌యాదవ్

నవతెలంగాణ- ములుగు



జనగామ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వర్ రెడ్డి వారి నివాసంలో ములుగు ఎంపీపీ గంగ కోట శ్రీదేవి సుధీర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానం చేసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నియోజకవర్గంలో జరిగిన పరిణామాలపై చర్చించారు. నాయకులంతా రాబోయే ఎన్నికల్లో సమిష్టిగా కషి చేసి అత్యధికంగా బీఆర్ఎస్ సీట్లు గెలుచుకునే విధంగా కష్టపడాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

నవతెలంగాణ - ములుగు



జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సైక్లింగ్ పోటీలలో పాల్గొని జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన ములుగు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన డోంగ్రి శ్రీనివాస్, తేజావత్ యాకూబ్, గొట్టిముక్కుల తులసిరామ్, పూతల మనోహర్ లను పాఠశాల ఉపాధ్యాయ బందం అభినం దించారు. శుక్రవారం నుండి సిద్దిపేటలో జరగబోయే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో కూడా పాల్గొని చక్కని ప్రతిభను ప్రదర్శించి బహుమతులు గెలుచు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బందం క్యాతం రాజేందర్, పిట్టల మల్లయ్య శిరూప సతీష్ కుమార్, తోట చంద్రమౌళి, గుండేటి మమత, సంగ చేరాలు, శివనాధుని శారద, బై కాని రజిత తదితరులు పాల్గొన్నారు.

గణితంలో జిల్లా స్థాయి పోటీలకు జూకల్ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-చిట్యాల



గణితం మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదిన సందర్భంగా గురువారం చిట్యాల మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో జెడ్పీహెచ్ఎస్ జూకల్ పాఠశాలకు చెందిన గుండెకారి తేజశ్రీ ప్రథమ స్థానం. అన్నం కౌశిక్ తతీయ స్థానంలో నిలిచారు. ఈనెల 22న జరుగు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గ్రామ సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఎంపీ టీసీ జంబుల తిరుపతి, ఉపసర్పంచ్ ఆనంద్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ గుండేకారి రమేష్ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు జి కృష్ణ, ఉపాధ్యాయ బందం విద్యార్థులను అభినందించారు. వారికి శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయులు ఎల్ రంజిత్‌కుమార్, ఎం స్వరూప కషిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొనియాడారు.

విద్యార్థుల ప్రతిభ.. ఉపాధ్యాయుల అభినందన

నవతెలంగాణ-చిట్యాల



అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కేజీబీవీ పాఠశాల ఎస్ఓ సుమలత, పీఈటీ ఉమా గురువారం అభినందిం చారు. అనంతరం వారు మాట్లా డుతూ... ఇటీవల డిసెంబర్-19న భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ స్టేడియంలో జూనియర్ అథ్లెటిక్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్-14 అండర్-16 బాయ్స్ అండ్ గర్ల్స్ పోటీల్లో కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు హెచ్ రాజేశ్వరి, జి జీవన, ఉత్తమ ప్రతిభ కనబరిచి డిసెంబర్ 23న కామారెడ్డి లో జరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సదరు విద్యార్థులను స్పెషలాఫీసర్ పీఈటి ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

క్రీడాకారులకు సన్మానం

నవతెలంగాణ-గణపురం



69వ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఎంపికైన పోలీస్ కానిస్టేబుల్ కంచర్ల సతీష్ మరో క్రీడాకారుడు కల్లూరు సతీష్ బాలికల విభాగానికి కోచుగా మామిడి శెట్టి రవీందర్ ఎంపిక కాగా వీరికి సోక్కం సదయ్య ముదిరాజ్ గురువారం శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బి రవీందర్రావు, ప్రధాన కార్యదర్శి వీరన్న ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.

ఉరి వేసుకొని ఆత్మహత్య

నవతెలంగాణ-గణపురం



గణపురం మండల కేంద్రానికి చెందిన బైరపాక వెంకటేష్ (25) ఆర్థిక ఇబ్బందులతో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలా ఉన్నాయి వెంకటేష్ ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మతుని తండ్రి ఫిర్యాదు మేరకు గణపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం ములుగు సామాజిక ఆసుపత్రి తరలించారు.

విద్యుత్‌ఘాతంతో దుక్కిటెద్దు మృత్యువాత

నవతెలంగాణ-చిట్యాల



విద్యుద్ఘాతంతో దుక్కిటెద్దు మృత్యువాత పడిన సంఘటన మండల కేంద్రం శివారు వెంకట్రావు పల్లి(సి) గ్రామంలో గురువారం జరిగింది. రైతు జట్టి కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ శివారులో పెద్ద చెరువు పక్కన నల్లాల బావి సమీపంలో మేస్తున్న క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై మతి చెందింది. దాని విలువ సుమారు 60 వేలు ఉంటుందని, విద్యుత్ శాఖ, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

అనాథలకు నిత్యావసర వస్తువులు పంపిణీ

నవతెలంగాణ-వాజేడు



కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటాపురం, వాజేడు మండలాల్లో 350 అనాథ, నిరుపేద కుటుంబాలకు నెలకు కావాల్సిన నిత్యావసర సరుకులను రైస్ బ్యాగ్, ఆయిల్, పసుపు, కొబ్బరి నూనె, కంది పప్పు, గోధుమ పిండి, ఉప్పు, దుప్పట్లు, పిల్లలకు ప్రోటీన్ పౌడర్, మెడికల్, కూరగాయలు మొదలైనవి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు మాట్లాడుతూ... ఇరవై ఏళ్ల కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ వెంకటాపురం మరియు వాజేడు మండలాల అభివద్ధికై మహిళ గ్రూప్స్,చిల్డ్రన్ పార్లమెంట్,యూత్ అండ్ ఫార్మర్ గ్రూప్స్, డ్రాప్ ఔట్ చిల్డ్రన్‌కి విద్య,పేద ప్రజలకు నిత్యవసర వస్తువులు ఇవ్వడం, గ్రామాల్లో మెడికల్ క్యాంపులు, చైల్డ్ రైట్స్, ట్రైబల్ రైట్స్ పై అవగాహన వంటి ఎన్నో రకాల అభివధి కార్యక్రమలు చేస్తూ వస్తుందని అన్నారు. ఇకపై తమ సేవలను ఇతర మండలాలకు కూడా విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లూర్దు రాజు, కో ఆర్డినేటర్ హనుమంతు, కామేష్, ఆనిమేటర్స్ ఇందిరా, పద్మ, ప్రశాంత్, నరేష్, ఉష, భాస్కర్, రమాదేవి, ప్రసాద్, స్వరూప, వెంకటాపురం చర్చ్ ఫాదర్ సుధాకర్, చిడెం శివ, చిడెం రవి, మన్యం సునీల్, పర్సిక సతీష్ , తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
శుక్రవారం | డిసెంబర్ 22, 2023 | www.navatelangana.com

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ పార్టీ దంపతులు

నవతెలంగాణ-టేకుమట్ల

భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ను గురువారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసినట్లు కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు మోతె రాజమౌళి, చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మోతె అరుణాదేవి ప్రకటనలో తెలిపారు.



క్రిస్మస్‌కు 1000 గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీకి సిద్ధం

- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్ జెర్సన్ కుమార్

నవతెలంగాణ - ములుగు



క్రిస్మస్ పండుగ సందర్భంగా నిరుపేద క్రైస్తవులకు పంపిణీ చేసేందుకు 1000 గిఫ్ట్ ప్యాకెట్లు సిద్ధం చేశామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్. జెర్సన్ కుమార్ గురువారం తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం నుంచి విందు కొరకు రూ.2,00,000, నియోజకవర్గంలో 1000 గిఫ్ట్ ప్యాకెట్లను నిరుపేద క్రైస్తవులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా మంత్రి సమయం తీసుకుని సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్, సిసిఓసి కమిటీ ద్వారా గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ జరుగుతుందని ఆ ప్రకటనలో ఎన్. జెర్సన్ కుమార్ తెలిపారు.

సింగరేణి అధికారులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ -కోల్ బెల్ట్



భూపాలపల్లి ఏరియాలోని గనుల సంక్షేమ అధికారులు, పిఏలు, సహాయకులు, కాంట్రాక్టర్లతో టీడీఎస్/టీసీఎస్(ఆదాయపు పన్ను నమోదు) అంశంపై గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జీఎం కార్యాలయంలో ఐఆర్ఎస్- జెసిఐటి అదితి గోయల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం బళ్లారి శ్రీనివాసరావుతో కలిసి గోయల్ హాజరై మాట్లాడారు. క్రమం తప్పకుండా, నిజాయితీగా ఆదాయపన్ను వివరాలను సంబంధిత వెబ్సైట్లలో ఎలా నమోదు చేయాలి, ఇప్పటివరకు చేస్తున్న తప్పు, ఒప్పుల గురించి వివరించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే ఎలా పరిష్కరించుకోవాలో వివరించారు. ఐఆర్ఎస్- డీసీఐటీ నుంచి పి. సుధాకర్ నాయక్, ఐటిఓ మాధవి ఎల్లంరాజు, ఐటిఐ గీతా వెంకటలక్ష్మి, ఐటిఐ కిరణ్ కుమార్, ఎస్ఓ టు జీఎం బండి వెంకటయ్య, డీజీఎం (పర్సనల్) అజ్మీర తుకారాం, ఏవో మౌనిక, డీవైపీఎంలు క్రాంతి కుమార్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ- తాడ్వాయి



మండలంలోని కాటాపూర్ పరిధిలో గల "కాటాపూర్, అన్నారం" వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇన్చార్జులు (నిర్వాహకులు) ఎండి ఖలీల్, షేక్ ముజాహిద్ లు పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్ముకుండా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాలకే విక్రయించాలన్నారు. ఏ వన్ గ్రేడ్ వరి ధాన్యానికి కింటాకు రూ. 2203, సీ గ్రేడ్ ధాన్యానికి రూ.2183 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పల్నాటి రాంబాబు, ఎస్ కె వాజిద్, ఎండి రహమాన్, రాధారపు రాములు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-మల్హర్‌రావు



మంథని నియోజకవర్గంలోని పాలకుర్తికి చెందిన గుర్రాల పుష్ప అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరింది. వైద్య ఖర్చుల కోసం సహాయ నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులు రాష్ట్ర ఐటి,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఆశ్రయించారు. ఇందుకు మంత్రి దుద్దిళ్ల రూ.2.50 లక్షల సిఎంఆర్ఎఫ్ ఎల్ఓసిని మంజూరు చేయించారు. గురువారం ఆసుపత్రి సహాయకులు బాధిత కుటుంబానికి ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు. ఇందుకు మంత్రికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏకాభిప్రాయం ఉంటేనే తీర్మానం

- ఇంటికొకరిని సభ్యుడిగా ఎన్నుకోండి
- భద్రాచలం ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్

నవతెలంగాణ-వెంకటాపురం

గిరిజనుల మధ్య గ్రామాల్లో ఏకాభిప్రాయం ఉంటేనే పేసా గ్రామసభ తీర్మానం చేయడం జరుగుతుందని గిరిజనులంతా గ్రామాల్లో సఖ్యతగా ఉండేలా కృషి చేసుకోవాలని భద్రాచలం ఐటిడిఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం మండలంలోని వీరభద్రవరం 4, పూజారి గూడెం, రామచంద్రాపురం, అంకన్న గూడెం గ్రామాల్లో ఇసుక క్వారీల నిర్వహణ కొరకు పేసా గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభల పర్యవేక్షకులుగా భద్రాచలం ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్ హాజరయ్యారు. తొలుత వీరభద్రపురం పంచాయతీలో పేసా గ్రామసభలో పాల్గొన్నారు. ఆ పంచాయతీలో ఆంజనేయ, కనకదుర్గ, ముత్యాలమ్మ గిరిజన ఇసుక సొసైటీలు పైసా గ్రామ సభలో పోటీపడ్డారు. దాంతో గ్రామాల్లో గిరిజనుల మధ్య ఆదిపత్య పోరును గ్రహించిన పిఓ గిరిజనల మధ్య సఖ్యతను కుదిరిచే ప్రయత్నం చేశారు. గిరిజన మధ్య వివాదాలకు కారణాలను గ్రహించిన పిఓ వారికి నచ్చజెప్పే విధంగా ప్రయత్నించారు. ఇసుక సొసైటీ కమిటీలో గ్రామ స్తులంతా ఇంటికొకరు భాగస్వామ్యులు చేయాలన్నారు. వివాదాలు మాని ఒక్క సొసైటీ ఏర్పాటు చేసుకొని కలిసికట్టుగా ఇసుక వ్యాపారం చేసుకునేలా ప్రయత్నం చేయాలన్నారు. ఏకతాటిపై ఉంటే గ్రామ సభ సజావుగా నిర్వహించుకోవచ్చు అని సూచించారు. దానికి మూడు సొసైటీలు ఏకతాటి పైకి రాకపోవడంతో గ్రామసభను వాయిదా వేస్తున్నట్లు తీర్మానం చేశారు. అంకన్నగూడెం పంచాయతీ కార్యాలయంలో అంకన్న గూడెం, పూజారి గూడెం లకు నిర్వహించిన పైసా గ్రామసభల్లో సైతం రెండు సొసైటీల సభ్యుల మధ్య సఖ్యత కుదరకపోవడంతో ఈ గ్రామ సభలను సైతం వాయిదా వేసినట్లు తీర్మానించారు. అనంతరం రామచంద్రాపురం నాలుగు, సుబ్రహ్మణ్య పురం కాలనీలో పెస గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామాల్లో ఇసుక నిర్వహణకు ఒక్కొక్క సొసైటీ సభ్యులే పోటీలో ఉండడంతో ఆ గ్రామ సభలను ఆమోదించారు. అనంతరం భద్రాచలం ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ గ్రామాల్లోని గిరిజనులకు చేయూతను అందించేందుకు నిర్వహిస్తున్న ఇసుకరాంపుల్లో వివాదాలు మాని ప్రతి గిరిజన కుటుంబానికి ఆదాయం చేకూర్చుకునేలా ఉండాలన్నారు. సొసైటీలకు రూ. 80 కోట్లు ప్రభుత్వం ద్వారా ఐటీడీఏకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఏటూరు నాగారం ఏ ఎస్పి సిరి శెట్టి సంకీర్త్ , తాసిల్దార్ సమ్మయ్య, ఎంపీడీవో బాబు, వీరభద్రవరం, రామచంద్రాపురం సర్పంచులు పాల్గొన్నారు.



సింగరేణి ఎన్నికలపై తీర్పు వెలువరించిన హైకోర్టు

నవతెలంగాణ -కోల్ బెల్ట్

ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై గతంలో రెండు మూడు సార్లు ప్రభుత్వాలు, కార్మిక సంఘాలు కోర్టులను ఆశ్ర యించి వాయిదాలు కోరిన సంగతి విధితమే తాజాగా. తాజాగా తెలం గాణ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ కొలువు దీరాక సింగరేణి ఎన్నికలపై ప్రభుత్వం కోర్టును ఆశ్రయించగా గురువారం హైకోర్టు సింగరేణి ఎన్నికలపై సస్పెన్స్ కు తెరదించుతూ ఈనెల 27న యధాతథంగా ఎన్నికలు నిర్వహించాలని తీర్పును వెలువరించింది. హైకోర్టు తీర్పు పట్ల కార్మిక సంఘాలు ప్రధానంగా సిఐటియు, ఏఐటీయూసీ, బీఎంఎస్, టీబీజీకేఎస్‌తోపాటు కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీతోపాటు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో యాజమాన్యం తీర్పును దృష్టిలో పెట్టుకొని చకచకా ఏర్పాట్లు సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్



తిరుమల తిరుపతి సత్యనారాయణ స్వామి వ్రతం పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గణపురం

మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం బ్యానర్‌ను గురువారం ఉమా మహేశ్వర స్వామి సేవ కమిటీ నిర్వాహకులు ఆకుల సుభాష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ పోతుల ఆగమ్మ, ఉపసర్పంచ్ ఆకుల తిరుపతి, టీటీడి ధర్మచార్యులు శ్రీ ఇలపంటి రాఘవేంద్ర రాజు ఆలయ పూజారి లంక రాజేశ్వర్ రావు శర్మ, ఆకుల రవీందర్, నారగాని ఎల్లాస్వామి, పోతుల విజేందర్, హాజరై మాట్లాడారు ఈ కార్యక్రమంలో ఆరెందాల శంకర్, వాల నర్సింగరావు, కన్న సాంబయ్య, ఆకుల చిన్న సాంబయ్య బెనికి రాజు, గాజ రమేష్, రౌతు అశోక్, ఆకుల దామోదర్, సింగం రాజవిరు,తిప్పని విష్ణు, ఆకుల రాజ్ కుమార్ సాదు కరుణాకర్, గండే శ్రీనివాస్, ఎల్లంకి రమేష్, జీడి రమేష్, జీడి శివుడు,రాజోజ్ రాజు పనికల కృష్ణ, కాటకం స్వామి,దూలం రాకేష్,పూజారి శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు

ఎవరెన్ని కుట్రలు చేసినా ఏఐటీయూసీ గెలుపు తథ్యం

- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్



నవతెలంగాణ-కోల్‌బెల్ట్

ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో ఇతర కార్మిక సంఘాలు ఎన్ని కుట్రలు చేసినా గెలుపు మాత్రం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)దేనని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 గనిలో జరిగిన గేట్ మీటింగ్‌కు ఫిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి అధ్యక్షత వహించగా రాజ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. కార్మిక సమస్యల పరిష్కారం సర్కార్ సంఘాలతో సాధ్యం కాదని, కార్మికుల పక్షాన నిరంతరం పోరాడే ఏఐటీయూసీతోనే సాధ్యమని అన్నారు. సింగరేణిలో ఎన్నికలు ఆపడానికి ఇతర సంఘాలు ఎన్ని కుట్రలు చేసిన చివరికి ప్రజాస్వామ్యం గెలిచిందని కోర్టులపై కమ్యూనిస్టులకు అపార నమ్మకం ఉందని స్పష్టం చేశారు. దీనికి నిదర్శనమే సింగరేణి ఎన్నికలపై హైకోర్టు గురువారం వెల్లడించిన తీర్పన్నారు. ఏఐటీయూసీ గెలిస్తేనే సింగరేణికి రక్షణ ఉంటుందని అన్నారు. తమ సంఘం గెలిస్తే కార్మికుల సొంతింటి పథకాన్ని అమలయ్యే విధంగా చూస్తామని, కోల్ ఇండియా మాదిరిగా పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు చేసే విధంగా చూస్తామని, సింగరేణిలో విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. సింగరేణి భవిష్యత్తు కోసం, యువ కార్మికుల మనుగడకు కొత్త గనులు రావాలని ఆకాంక్షించారు. ఈనెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో చుక్క గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాల పల్లి బ్రాంచ్ సెక్రెటరీ మోట పలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్,జి. శ్రీనివాస్, ఎం. విజేందర్, నూకల చంద్రమౌళి, మైన్ ఇంచార్జ్ ఎండి ఆసిఫ్ పాషా, వెంకటేష్,మంత్,బాలు,రాజన్న ,గణేష్,జి .తిరుపతి, భోగ రమేష్, సర్వేశ్ రాజేందర్, ఏ.సాంబయ్య,తిరుపతిరెడ్డి, బి .రామన్న ,శ్రీకాంత్ రెడ్డి, ప్రకాష్,అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ - ములుగు

అబాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ అభివృద్ధి కోసం గ్రామానికి రావాల్సిన క్రీడా ప్రాంగణానికి సంబంధించిన స్పోర్ట్స్ కిట్లు ఇన్ని రోజులు ఎలక్షన్ కోడ్ ఉన్నందున పంపిణీ చేయడం జరగనందున గ్రామ సర్పంచ్ గండి కల్పన గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గండి కుమార్, ఉపసర్పంచ్ నల్లెల్ల ప్రభాకర్, గ్రామ కార్యదర్శి యాదవరాజు, వార్డ్ నెంబరు తోట రాజేందర్, యూత్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ పరామర్శ

నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బైరపాక వెంకటేష్ మరియు అంగడి బజార్ చెందిన మెరుగు రామస్వామి గౌడ్ అనారోగ్య కారణాలతో మతిచెందాడు. గురువారం వైస్ ఎంపీపీ విడుదలలేని అశోక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు బాధితులను పరామర్శించినట్లు ఆయన తెలిపారు.